ఈ ఏడాది పొగాకు సాగు ఆరంభం నుంచే రైతులకు అవస్థలు ప్రారంభమయ్యాయి. నాట్ల దశలోనే పాట్లు పడాల్సి వస్తోంది. గత నెలలో మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో సకాలంలో పంట సాగు చేయలేకపోయారు. వానలకు చాలాచోట్ల దొడ్లు పూర్తిగా దెబ్బతినడంతో పొగాకు నారుకు కొరత ఏర్పడింది. దీంతో నారు ధర భారీగా పెరిగింది. ఎకరా విస్తీర్ణంలో పొగాకు నాట్లు వేసేందుకు సేద్యం, నారు, ఎరువులు, కూలి, ఇతర ఖర్చులు అన్నీ కలిపి సగటున రూ.35వేల వరకూ ఖర్చవుతోంది. గత సీజన్‌తో పోల్చితే నాట్లు వేసే రోజే దాదాపు 40శాతం అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. మరోవైపు గత సీజన్ కొనుగోళ్లు ఇంకా ముగియకపోవడం సాగుదారులను మరింత కలవరపెడుతోంది.

ఒంగోలు నగర పరిధిలోని ముక్తినూతలపాడు సమీపంలో వేస్తున్న పొగనాట్లు



- పొగాకు సాగును దెబ్బతీసిన మొంథా తుఫాన్
- కీలక సమయంలో భారీ వర్షాలు
- చాలాచోట్ల సకాలంలో నాట్లు వేయలేకపోయిన దుస్థితి
- ఇప్పటి వరకు దక్షిణాదిలో 18,026 హెక్టార్లలోనే సాగు
- గత ఏడాది కన్నా 47శాతం తక్కువ
- ఇంకా పూర్తికాని గత సీజన్ వేలం

ఆరంభంలోనే అవస్థలు

ఒంగోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాదిలోని రెండు జిల్లాల్లో మొత్తం 11వేలం కేంద్రాలు ఉండగా సుమారు 24వేల నుంచి 25వేల బ్యారన్‌లకు రైతులు లైసెన్స్‌లు కలిగి ఉన్నారు. వాటి పరిధిలో 2025-26 పంట కాలానికి దాదాపు 62వేల హెక్టార్లలో సాగుకు, సుమారు 90.20 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. దక్షిణాది ప్రాంతంలో ప్రస్తుతం పొగాకు నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒకవైపు వాతావరణం అనుకూలించక సాగు జాప్యం, మరో వైపు నారు, ఇతర ధరలు పెరగడం రైతులకు భారంగా మారింది.

తుఫాన్‌తో అంతా తారుమారు

బోర్డు అనుమతించిన విస్తీర్ణంలో 60 శాతం మేర ఈసమయానికి నాట్లు వేస్తారు. ప్రధానంగా దక్షిణాది తేలిక నేలలుగా ఉండే జిల్లాలోని పొదిలి, కనిగిరి, నెల్లూరు జిల్లాలోని కలిగిరి, డీసీపల్లి, కందుకూరు వేలం కేంద్రాల్లోని అధిక భాగంలోనూ, అలాగే ఎస్‌బీఎస్ రీజియన్‌లోని ఎగువ ప్రాంతాల్లోనూ నాట్లు వేయడం పూర్తవుతుంది. కొన్నిచోట్ల సెప్టెంబరు ఆఖరులో నాట్లు ప్రారంభమై అక్టోబరు రెండో పక్షానికి ముమ్మరమవుతాయి. అలాంటిది ఈ ఏడాది మొంథా తుఫాన్ ముంచెత్తి సీజన్‌ను తారుమారు చేసింది. ఎస్ఎల్ఎస్ రీజియన్‌లో ముమ్మరంగా నాట్లు వేసే సమయంలో తుఫాన్ విరుచుకుపడటంతో సాగు జాప్యమైంది. చాలాచోట్ల 15నుంచి 20 రోజులపాటు మొక్కలు నాటలేకపోయారు. కొన్నిచోట్ల బురదలోనే నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమైనప్పటికీ భారీ వర్షాలతో నారుమళ్లు దెబ్బతిన్నాయి. నారు ధర కొండెక్కి. కూర్చోవడమే కాక నాణ్యత అంతగా లేక రైతులు ఇబ్బంది పడ్డారు.



నారు ధర విపరీతంగా పెరిగిందని చెబుతున్న మహిళా రైతు


18వేల హెక్టార్లలోనే నాట్లు

గత ఏడాది ఈ సమయానికి ఎస్ఎల్ఎస్ రీజియన్‌లో సుమారు 19,900 హెక్టార్లు, ఎస్‌బీఎస్‌లో సుమారు 18,500 హెక్టార్లు వెరసి ఇంచుమించు 38,400 హెక్టార్లలో పొగాకు నాట్లు వేశారు. అయితే ఈసారి అందులో సగం విస్తీర్ణంలో కూడా నాట్లు పడిన పరిస్థితి లేదు. అధికార వర్గాల సమాచారం ప్రకారం ఈ ఏడాది ఇప్పటి వరకు ఎస్ఎల్ఎస్ రీజియన్‌లో సుమారు 11,500 హెక్టార్లు, ఎస్‌బీఎస్ రీజియన్‌లో 6,500 హెక్టార్లు వెరసి 18వేల హెక్టార్లలో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని పొదిలి, కనిగిరి కేంద్రాల పరిధిలో ఒక మోస్తరుగా నాట్లు వేయగా, మిగతా చోట్ల అంతగా కనిపించడం లేదు. నాలుగైదు రోజులుగా అన్ని ప్రాంతాల్లోనూ ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు.

దిగుబడి తగ్గుతుందని రైతుల ఆందోళన

ఎస్ఎల్ఎస్ రీజియన్ ప్రాంతంలో నెల రోజులకుపైన ఆలస్యంగా పొగాకు నాట్లు వేస్తుండటం వలన పంట దిగుబడి తగ్గే అవకాశం ఉండటంతో రైతులు కొంత ఆందోళన చెందుతున్నారు. జనవరి తర్వాత ఒక మోస్తరు వాన కురిస్తే తప్ప దిగుబడిరాదంటున్నారు. ఒకవైపు పొగాకు నాట్లు ముమ్మరమైనప్పటికీ ఇంకా గత సీజన్ కొనుగోళ్లు ముగియకపోవడం రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తోంది.

భారీగా పెరుగుతున్న పెట్టుబడి ఖర్చు



పొగాకు నాట్లకు ఈసారి ఖర్చు భారీగా పెరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఈ సమయంలో మూట నారు ధర రూ.1,500 నుంచి 2వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.6వేల నుంచి 7వేలు పలుకుతోంది. ఎకరాకు రెండు మూటల నారు అవసరం కాగా ఇందులోనే దాదాపు ఎకరాకు గతం కన్నా సగటున రూ.8వేల నుంచి 10వేలు అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. గత ఏడాది రూ.6వేల వరకు ఉన్న సేద్యపు ఖర్చులు ఈసారి దాదాపు రూ.10వేలకు పెరిగాయి. వర్షాలతో మళ్లీమళ్లీ దున్నాల్సి రావడంతో ఆమేరకు ఖర్చు పెరిగింది. ఇక నాట్లు వేసే కూలీలకు రూ.5వేల నుంచి రూ.6వేలు, ట్యాంకర్ నీటికి రూ.2వేలు, బలం కోసం వేసే ఎరువులకు మరో 10వేల వరకూ అవుతున్నాయి. అలా పొలంలో పొగాకు మొక్క నాటే సరికి సగటున ఎకరాకు రూ.35వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. అంటే గత ఏడాది కన్నా నికరంగా ఎకరాకు 40శాతానికిపైగా ఖర్చు నాట్లు వేసే సమయానికే పెరిగి రైతులు ఆందోళన చెందుతున్నారు.

సీసీఎస్ నుంచి ఇద్దరు దొంగలు పరారీ

వారిలో ఒకరు మోస్ట్‌వాంటెడ్

ఒంగోలు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సీసీఎస్ పోలీసు స్టేషన్ నుంచి ఇద్దరు దొంగలు పరారయ్యారు. అందులో ఒకరు మోస్ట్ వాంటెడ్ అని తెలిసింది. వివరాల్లోకి వెళితే.. నగరంలో అనేక దొంగతనాలు, దోపిడీలకు పాల్పడిన నాగూర్‌తోపాటు మోటారు సైకిళ్ల దొంగ అయిన అస్కర్‌ను రెండు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. ఒంగోలు సీసీఎస్‌లో ఉన్న ఇద్దరు దొంగలు ఆదివారం అక్కడి సెంట్రీ కళ్లుగప్పి పరారయ్యారు. వీరిలో నాగూర్ గతంలో పలు దొంగతనాలు, దోపిడీల కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇరువురూ కలిసి ఇటీవల ఐదు మోటారు సైకిళ్లను దొంగిలించినట్లు తెలిసింది. వాటిని సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పరారైన ఇద్దరు దొంగల కోసం సీసీఎస్‌తోపాటు, ఐడీ పార్టీ పోలీసులు గాలింపు చేపట్టారు.


పశువులపై పులి పంజా

వరుస దాడులతో పోషకుల బెంబేలు

ఈ ఏడాదిలోనే అధికం

7

- వివిధ అంశాలపై విచారణ
- వెలుగులోకి విస్తుగొలిపే విషయాలు
- ఉద్యోగోన్నతుల కోసం ఇద్దరు ఉద్యోగుల అడ్డదారి
- నకిలీ ధ్రువీకరణపత్రాలతో ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడి
- మరికొన్ని విషయాలపైనా లోతుగా పరిశీలన



ఆర్అండ్‌బీ కార్యాలయం

ఆర్అండ్‌బీ శాఖపై విజి'లెన్స్'!

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్లు, భవనాల శాఖపై విజిలెన్స్ దృష్టి సారించింది. వివిధ అంశాలపై విచారణ చేస్తోంది. ఇప్పటికే ఆశాఖలో ఉద్యోగోన్నతుల కోసం ఇద్దరు ఉద్యోగులు అడ్డదారి తొక్కిన విషయం బహిర్గతమైంది. ఒక వైపు చదువు పేరుతో ఆ ఇద్దరూ సెలవు తీసుకొని, మరోవైపు సుమారు రూ.26లక్షల మేర జీతాలు డ్రా చేయడం విస్తుగొలుపుతోంది. ఆర్అండ్‌బీలో మరికొన్ని విషయాలపైనా విజిలెన్స్ అధికారులు లోతైన విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఏం జరిగిందంటే..

ఆర్అండ్‌బీ కనిగిరి డివిజన్‌లో ప్రింటింగ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న ఒకరు, అటెండర్‌గా పనిచేస్తున్న మరొకరు ఉద్యోగోన్నతుల కోసం మోసం చేసినట్లు తెలిసింది. వారిద్దరూ రెండేళ్ల చదువు కోసం ఈఎన్‌సీ నుంచి స్టడీ లీవ్ పొందారు. చీరాలలోని ఒక ఐటీఐ కాలేజీలో 2020-22 బ్యాచ్ కింద రెగ్యులర్ స్టూడెంట్స్‌గా జాయిన్ అయ్యారు. తొమ్మిది నెలల అనంతరం తిరిగి ఉద్యోగాల్లో చేరారు. ఆ తర్వాత 13 నెలలకు జీతాలు డ్రా చేశారు. రెండేళ్ల చదవాల్సిన ఐటీఐ సివిల్స్‌ను తొమ్మిది నెలలు మాత్రమే చదివిన వారు కోర్సును పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు పుట్టించినట్లు తెలిసింది. అనంతరం ఉద్యోగోన్నతుల కోసం ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి కార్యాలయంలో కొందరు అధికారులు సహకరించినట్లు తెలిసింది.

వెలుగులోకి ఇలా..

ఆ ఇద్దరు ఉద్యోగులు సమర్పించినవి నకిలీ సర్టిఫికెట్‌లు అని గుర్తించిన కార్యాలయంలోని కొందరు వ్యక్తులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఒంగోలు విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయానికి వెళ్లి ఇద్దరు ఉద్యోగుల విద్యార్హతలు, సర్వీస్ రికార్డులు, పే స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు. పూర్తి విచారణ చేసిన వారు ఉద్యోగోన్నతుల కోసం ఇద్దరు ఉద్యోగులు మోసానికి పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

ఇతర అంశాలపైనా విజిలెన్స్ కన్ను

ఆర్అండ్‌బీ ఎస్ఈ, ఈఈ, డివిజన్ కార్యాలయాల్లో జరుగుతున్న పలు అంశాలపైన కూడా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కన్నేసినట్లు తెలిసింది. కేవలం ఉద్యోగోన్నతుల విషయంలోనే కాకుండా పలు పనులకు సంబంధించి జరిగిన ఆర్థిక లావాదేవీలు, అనుమతులకు సంబంధించి చోటుచేసుకుంటున్న గూడు పుఠాణీపైనా దృష్టి సారించినట్లు సమాచారం. దీంతో ముందు ఏఏ అంశాలు వెలుగులోకి వస్తాయోనని ఆశాఖలోని ఉద్యోగులు వణికిపోతున్నారు.

గ్రానైట్ సమస్యలు పరిష్కరిస్తాం

- పరిశ్రమకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం
- మంత్రి కొల్లు రవీంద్ర
- ఒంగోలులో గనుల శాఖ భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మంత్రులు రవీంద్ర, స్వామి, ఎమ్మెల్యేలు, జేసీ

ఒంగోలు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఒంగోలులోని దక్షిణ బైపాస్ రోడ్డు సమీపంలో రూ.2.14 కోట్లతో నిర్మించనున్న గనుల శాఖ కార్యాలయానికి ఆదివారం ఆయన జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాయల్టీ వసూలు విషయంలో గ్రానైట్ పరిశ్రమకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ గనులను దోచుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు పారదర్శకంగా మైనింగ్ పాలసీని అమల్లోకి తెచ్చారన్నారు. రాష్ట్రంలో ఇసుకకు కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇటీవల విశాఖలో జరిగిన సదస్సులో రూ.13.50 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారని అన్నారు. పరిశ్రమల స్థాపన వలన 17.50 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి మాట్లాడుతూ ఒంగోలులో గనుల శాఖ కార్యాలయ నిర్మాణం వలన పారిశ్రామికవేత్తలకు మరింత సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు బీఎన్ విజయ్‌కుమార్, ఉగ్రనరసింహారెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ సత్య, నగర మేయర్ సుజాత, ఒడా చైర్మన్ రియాజ్, జేసీ గోపాలకృష్ణ, గనులశాఖ డీఎంజీ చంద్రశేఖర్, డీడీ రాజశేఖర్ పాల్గొన్నారు.



మాక్ అసెంబ్లీ శిక్షణకు విజయవాడ వెళ్తున్న విద్యార్థులతో డీఈవో కిరణ్‌కుమార్

26న స్టూడెంట్స్ మాక్ అసెంబ్లీ

- ఎంపికైన 9మందికి నేడు, రేపు శిక్షణ
- విజయవాడకు బయల్దేరి వెళ్లిన విద్యార్థులు

ఒంగోలు (విద్య), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న అమరావతిలోని శాసనసభ భవనంలో నిర్వహించనున్న స్టూడెంట్స్ మాక్ అసెంబ్లీకి జిల్లా నుంచి 9మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా ఒక్కొక్కరు, అసెంబ్లీలో మార్షల్‌గా ఒకరు వ్యవహరిస్తారు. ఒంగోలు నియోజకవర్గం నుంచి వి.లక్ష్మీపూజిత, సంతనూతలపాడు నుంచి ఎస్.శ్రీను, కొండపి నుంచి ఎం.పవన్‌కుమార్, దర్శి నుంచి షేక్ మహ్మద్‌ఫరూక్, కనిగిరి నుంచి ఆర్.జితేంద్ర, మార్కాపురం నుంచి గాయం వర్షిత, గిద్దలూరు నుంచి ఎస్.రమ్యశ్రీ, యర్రగొండపాలెం నుంచి ఎం.నవదీప్ శాసనసభ్యులుగా ఎంపికయ్యారు. యర్రగొండపాలెం నుంచి కె.నాగరాజును మార్షల్‌గా ఎంపిక చేశారు. వీరితోపాటు రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి ఎంపికైన వారికి అసెంబ్లీ సమావేశ నిర్వహణపై విజయవాడలో సోమ, మంగళవారాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. తొమ్మిది మంది విద్యార్థులతోపాటు ఇద్దరు గైడ్ టీచర్లను ఒంగోలు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి వాహనంలో ఆదివారం విజయవాడకు పంపారు. ఆ వాహనాన్ని డీఈవో కిరణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- ఇళ్ల స్థలాల మంజూరులో మాయ
- ఆన్‌లైన్‌లో పట్టాల సంఖ్య ఒకరకంగా, భౌతికంగా చూస్తే మరోరకంగా..!
- మిల్లంపల్లి సమీపంలో వేసిన ప్లాట్లలో అక్రమాలు కోకొల్లలు
- ఒక్కో నంబర్ ఇద్దరు ముగ్గురికి కేటాయింపు
- పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- విచారణలోనూ తిమ్మినిబమ్మిని చేసి సక్రమమేనంటూ అధికారుల నివేదికలు

జగనన్న కాలనీలో జంతర్‌మంతర్

త్రిపురాంతకం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఊళ్లు కడతామంటూ జగనన్న కాలనీల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాల విషయంలో అటు నేతల పోకడలు, ఇటు అధికారుల ఇష్టారాజ్యంతో అవకతవకలకు అడ్డే లేకుండా పోయింది. ప్రతిచోటా అవినీతి రాజ్యమేలింది. అటువంటి జాబితాలో ఎర్రగొండపాలెం మండలంలోని మిల్లంపల్లి జగనన్న కాలనీలోని ప్లాట్లలో జరిగిన అక్రమాల చిట్టా పతాక స్థాయిలో నిలిచింది. వివరాల్లోకెళ్తే... ఎర్రగొండపాలెం పరిధిలోని మిల్లంపల్లి టోల్ గేట్ సమీపంలో వేసిన పెద్ద లే అవుట్‌లో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని గత వైసీపీ ప్రభుత్వంలో నేతలు గొప్పగా చెప్పారు. ఆ ప్రకారం పట్టాలు ఇచ్చారు కానీ అవి ఎవరికి చెందాయనేది ఇప్పటికీ మిస్టరీగానే మిగిలింది. ఆన్‌లైన్‌లో పట్టాలు ఇచ్చిన జాబితా 1,316 మందిగా చూపుతోంది. కానీ భౌతికంగా చూస్తే పట్టాల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉందని లబ్ధిదారులు చెబుతున్నారు.

బినామీల గుప్పిట్లో ప్లాట్లు

ఈ కాలనీలో పలు ప్లాట్లు బినామీల గుప్పిట్లో ఉన్నట్లు చెబుతున్నారు. రాజకీయపార్టీ నాయకులు, వ్యాపారవేత్తల చేతుల్లో కొన్ని ప్లాట్లు ఇతరుల పేర్లతో జారీ చేయబడి వారివద్ద ఉండిపోయినట్లు తెలుస్తోంది. అధికారులు విచారణ సమయంలో కూడా వీటిని మళ్లీ అసలైన జాబితాలోకి చేర్చి విచారణ తంతు ముగిస్తున్నారు. ఇలా ఎన్నిసార్లు విచారణ జరిపినా అక్రమాలకు పాల్పడిన అధికారులే అడ్డుపడుతూ వాటి లెక్క తేలకుండా చూస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపి పారదర్శకంగా విచారణ చేయించి పట్టాల లెక్క తేల్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


విచారణలోనూ తమదైన ముద్ర

కొన్ని ప్లాట్లలో ఒకే నంబరుతో పలువురికి పట్టాలు ఇచ్చారని మూడు నెలల క్రితం ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల్లో కదలిక వచ్చింది. దీనిపై మార్కాపురం సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేశారు. ఇందులో కూడా కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించి విచారణ కూడా తమకు ఆదాయ మార్గంగా మార్చుకున్నారు. అదే వీఆర్వో మళ్లీ ఈ విషయంలో తనదైన శైలిలో వసూళ్లకు తెరదీశారు. పట్టాల పరిశీలన సమయంలో నకిలీ పట్టాలను కూడా అసలైన పట్టాలుగానే చూపేందుకు మళ్లీ వారి వద్ద వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఇలా ప్రతిసారీ విచారణలు అంటూ సొమ్ము చేసుకోవటం తప్ప అసలు నకిలీ పట్టాల చిట్టా విప్పే పరిస్థితి కనిపించటం లేదు. దీంతో జగనన్న కాలనీలో అక్రమాల లెక్క మాత్రం తేలటం లేదు.

తహసీల్దార్, వీఆర్వోలు భారీగా వసూలు

మిల్లంపల్లి లే అవుట్‌లో గతంలో ఇక్కడ పనిచేసిన ఒక తహసీల్దార్‌తోపాటు ఒక వీఆర్వో అక్రమాల్లో సిద్ధహస్తులై ఇళ్ల పట్టా ఇచ్చేందుకు పలువురు లబ్ధిదారుల నుంచి భారీగా వసూలు చేశారని తెలిసింది. అదే స్థాయిలో పట్టాలు కూడా జారీ అయ్యాయని చెబుతున్నారు. ఒకే నంబర్‌తో ఇద్దరు ముగ్గురేసి లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వడం వివాదాస్పదమైంది.

మిల్లంపల్లి జగనన్న కాలనీ



ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

పూజల్లో పాల్గొన్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర


శ్రీసత్యసాయి పూజల్లో పాల్గొన్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర


నాగులుప్పలపాడులో శ్రీసత్యసాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అధికారులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయిబాబా 100వ జయంతి వేడుకలను ఆదివారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక రిమ్స్ అస్పత్రిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా స్థానిక మంగమూరురోడ్డులోని శ్రీసత్యసాయిబాబా మందిరంలో ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు హాజరయ్యారు. వారికి మందిర కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ భగవాన్ సత్య సాయిబాబా కేవలం ఆధ్యాత్మికవేత్త మాత్రమే కాదని, ప్రజలకు విద్య, వైద్యం, మంచినీటి సౌకర్యం వంటివి అందజేసిన భగవత్ రూపమని పేర్కొన్నారు. అనంతరం జరిగిన సామూహిక సత్యసాయి వ్రతాలలో పెద్దసంఖ్యలో దంపతులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం జరిగింది. సత్యసాయి యూత్, మహిళా విభాగం, బాలవికాస్ వారు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం పుట్టపర్తి సత్య సాయిబాబా 100వ జయంతి వేడుకలను కార్యాయ ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.రాజశేఖరరావు మాట్లాడుతూ సత్య సాయిబాబా ప్రజలకు ఎన్నో సామాజక సేవాకార్యక్రమాలను నిర్వహించారని చెప్పారు. పేదలకు తాగునీటి సౌకర్యాలు, ఉచిత వైద్య, విద్యా సేవలు కల్పించిన ఘనత ఆయన సొంతమని కొనియాడారు. సత్యసాయిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో శేషబాబు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: భగవాన్ సత్యసాయి బాబా జయంతి వేడుకలు ఆదివారం మద్దిపాడు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబు మాట్లాడుతూ విశ్వశాంతి, సకల జనుల సంతోషం కోసం పరితపించిన మహోన్నత వ్యక్తి సత్యసాయిబాబా అన్నారు. సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది వినయ్, సుగుణరావు, కిరణ్, పొదిలి కొండలరావు, విజేష్, ఈపూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయ సమీపంలో వీఆర్వో పర్వతరెడ్డి శేషుబాబు నేతృత్వంలో సత్యసాయిబాబు జయంతి వేడుకలు జరిగాయి. అదేవిధంగా ఆహారపొట్లాలను పంపిణీ చేశారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి చిత్రపటానికి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం స్థానిక గిరిజన కాలనీలోని ప్రజలకు పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు మానవ విలువలను బోధించారన్నారు. సేవే పరమావధిగా, ఎవరికీ హాని తలపెట్టవద్దని ప్రభోదించిన సత్యసాయి మానవ రూపంలో వెలసిన భగవంతుడు అని కొనియాడారు. తహసీల్దార్ మాట్లాడుతూ శ్రీసత్యసాయిబాబా భగవంతుని స్వరూపమన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏపీవో రవిబాబు, ఎమ్మార్సీ అంజయ్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఎంకేఆర్ హాస్పిటల్ ప్రారంభోత్సవం


హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం అంజయ్యరోడ్‌లోని బృందావన్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంకేఆర్ హాస్పిటల్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మేయర్ గంగాడ సుజాత హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత, న్యూరాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ కోట మాలకొండారెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ చైనత్యరెడ్డిలు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు న్యూరాలజీ, గైనిక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆధునాతన వైద్య పరికరాలు, అనుభవం కలిగిన వైద్యులు, వైద్యసిబ్బందితో ప్రజలకు మెరుగైన సేవలు అందించనున్నట్లు వారు పేర్కొన్నారు.

విద్యార్థులకు 'టాలెంట్ సెర్చ్' పోటీలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి నెలా టాలెంట్ సెర్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మరో గ్రంథాలయ ఉద్యమ కన్వీనర్ మంచికంటి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం ఒంగోలు నగరం సుజాతనగర్‌లోని అపెక్స్ హైస్కూల్‌లో ఇందుకు సంబంధించిన వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా టాలెంట్ సెర్చ్ వర్క్ షాప్ నిర్వహించి ప్రతిభావంతులను ఎంపికచేసి ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఇతర నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కొండపి ఎంఈవో పచ్చవ రామారావు వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. అపెక్స్ హైస్కూల్ కరస్పాండెంట్ శివకోటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మరో గ్రంథాలయ ఉద్యమ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని, ఇందుకు తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నల్లూరి కాంతి, సీఏ ప్రసాద్, బిందురాణి, గీత, రాజశేఖర్‌రెడ్డి, జిలానీబాష పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ


పడిభజనలో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

చీమకుర్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలోని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ గృహంలో ఆదివారం రాత్రి అయ్యప్ప పడిభజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తులతో నిర్మించిన మండపం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి, నందిని కుటుంబసభ్యులు పూజలు జరిపారు. దీక్షాధారులు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున విచ్చేసి భజనలో పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను నిలుపుదల చేయాలి

ఒంగోలు(రూరల్), నవంబరు23(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌ల అమలును వెంటనే నిలుపుదల చేయాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో పలు ప్రజా సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేసేలా ఉన్నాయన్నాయని మండిపడ్డారు. వాటిని నిలుపుదల చేసేంత వరకు పోరాటాలు చేయాలని చెప్పారు. ఈక్రమంలో ఈ నెల 26న జరిగే బైక్ ర్యాలీని ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రమేష్, జి.శ్రీనివాసులు, కొత్తకోట వెంకటేశ్వర్లు, జి.తిరుమలరావు, వి.రామ్‌మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

- కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న జరిగే బైక్ ర్యాలీలు, నిరసన ప్రదర్శలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.హనుమారెడ్డి, కె.వీరారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. లేబర్‌కోడ్‌లను నిలుపుదల చేసే వరకు జరిగే పోరాటాలకు ప్రజలు అండగా నిలవాలన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


రాజేష్ మృతదేహం

రాచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఆకవీడు పంచాయతీ పరిధిలోని ఆరవీటికోట గ్రామ పొలాల్లో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కె.రాజేష్ (30) తన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ ఫీజు వేసుకుంటూ ఉండగా కటింగ్ బ్లేడ్ విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ పి.కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని రాజేష్ మృతికిగల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకుని కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విద్యుత్ శాఖ ఏఈ కె.బాలగురవయ్య ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి

● మంత్రి స్వామి


పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర, చైర్మన్ సత్య

సింగరాయకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి చెప్పారు. సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం అండర్-19 బాలబాలికల హ్యాండ్ బాల్ పోటీలను కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యలతో కలిసి మంత్రి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్టేడియాలు, క్రీడా ప్రాంగణాలు, క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. క్రీడా రిజర్వేషన్లు 2 నుంచి 3 శాతానికి పెంచడం వల్ల ఇటీవల మెగా డీఎస్సీలో 421 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో క్రీడా రంగాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, క్రీడాకారులకు కనీస ప్రోత్సాహాలు కూడా కల్పించలేదని దుయ్యబట్టారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధికల్పనలో అందిస్తున్న సహకారం, ప్రోత్సాహాలపై ఎమ్మెల్యే ఉగ్ర, మారిటైం బోర్డు చైర్మన్ సత్యలు మాట్లాడారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే దామచర్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన పీడీసీసీబీ చైర్మన్ సీతారామయ్య, నేతలు

కొత్తపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం కొత్తపట్నంలో వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై దామచర్ల మాట్లాడుతూ నూతన కమిటీ ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటూ వారికి తగిన సహకారం అందించాలన్నారు. కొత్తపట్నం మండలంలో అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే జరిగిందని చెప్పారు. త్వరలోనే గ్రామాల్లో సిమెంటురోడ్ల నిర్మాణాలను, బీచ్‌లో ఫిషింగ్ హార్బర్ పనులు కూడా చేపట్టబోతున్నామని ఆయన వెల్లడించారు. కొత్తపట్నంలో బీచ్ వరకు డివైడర్‌తో సిమెంటు రోడ్ పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతూ పార్టీకి మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం కమిటీ అధ్యక్షుడిగా ద్వారగాపుల శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లుగా కొండూరి తిరుపతి, బలగాని సుభాస్ చంద్రబోస్‌లతో ప్రమాణం స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్ర గౌడ్, సర్పంచ్ వెంకటశ్రావణి, బీసీ సెల్ నాయకులు గేనం సుబ్బారావు, బలగాని వెంకటేశ్వరరావు, ప్రభుప్రకాష్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మాతృమూర్తుల పాత్ర కీలకం

● వీహెచ్‌పీ మాతృశక్తి సంయోజిక గౌరీసాదీకార్



సదస్సులో ప్రసంగిస్తున్న గౌరీసాదీకార్

ఒంగోలు కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధిలో మాతృమూర్తుల పాత్ర ఎంతో కీలకమైనదని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మాతృశక్తి సంయోజక గౌరీ సాదీకార్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని పెద్ద రామానుజకూటంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లిఖార్జునరావు అధ్యక్షతన జరిగిన దక్షిణాంధ్ర ప్రాంత మాతృశక్తి సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరీ సాదీకార్ మాట్లాడుతూ నాడు జిజియాబాయి చిన్నతనం నుంచే ఛత్రపతి శివాజీకి దేశభక్తిని బోధించి వీరుడిగా తీర్చిదిద్దిందన్నారు. ప్రతి మహిళ తమ బిడ్డలకు దేశభక్తి గురించి, దేశ నాయకుల గురించి అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ప్రార్ధన, యోగ మొదలైన కార్యక్రమాలు జరిగాయి. సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రాంత కార్యదర్శి పర్రే కోటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, సోమ సుబ్బారావు, ప్రణేష్, మురళమ్మ, ఈమని బలరాం, శ్రీనివాసగుప్తా, గడ్డం శ్రీనివాసరావు, పెరుమాళ్ రవి, సీతారామయ్య, అరవింద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి సీఐపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

● ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న నాయకులు

చీమకుర్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : బండ్లమూడి గ్రామంలో జరిగిన సంఘటనలో బాధితులైన దళితులపై తప్పుడు కేసులు నమోదు చేసిన చీమకుర్తి సీఐపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బండ్లమూడి గ్రామంలోని బాధిత కుటుంబసభ్యులను ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాట్లాడుతూ బాధిత దళితులపై తప్పుడు కేసులు బనాయించటంపై నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. దీనిపై ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఎమ్మార్పీఎస్ విధించిన ఆరు డిమాండ్లను ఈనెల 25వ తేదీలోపు నెరవేర్చకపోతే రాజ్యాంగదినోత్సవం నాడు ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఎస్.నరేంద్రబాబు, ఆర్.సురేష్, తొరటి ఆనంద్, మందా వెంకటేశ్వరరావు, సత్యం, రామకృష్ణ, ఎలీషా తదిదరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక..

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ సోమవారం బండ్లమూడి గ్రామాన్ని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా బాధిత కంట్లం ఏసుదాసు కుటుంబసభ్యులను ఆయన పరామర్శించనున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు


ప్రసాదం తీసుకువస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన గాలి గోపురం వద్ద నుంచి స్వామి వారికి మహానైవేద్యాన్ని మేళతాళాలతో స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గోశాలలోని గోమాతకు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో నరసింహబాబు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై చాకుతో దాడి

నాగులుప్పలపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వృద్ధురాలైన భార్యపై భర్త చాకుతో దాడిచేసిన సంఘటన నాగులుప్పలపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక తిమ్మనపాలెంరోడ్డులో గుర్రపుశాల వీరరాఘవులు,హైమావతి దంపతులు తమ కోడలితో కలిసి నివసిస్తున్నారు. ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో భర్త వీరరాఘవులు కత్తితో భార్య హైమావతిపై దాడి చేసి గాయపరిచాడు. దాంతో ఆమె కేకలు వేయడంతో రాఘవులు పారిపోయాడు. గాయపడిన హైమావతిని చికిత్స నిమిత్తం స్థానికులు 108వాహనంలో ఒంగోలులోని ఆసుపత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం నగరంలో పలు ప్రాంతాలలో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈ రంగారావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక మంగమూరు రోడ్డు, జడ్పీకాలనీ, కొత్తడొంక, జర్నలిస్టు కాలనీ, సుబ్బయ్యనగర్, మర్రిచెట్టుకాలనీ, ప్రగతినగర్, గాంధీనగర్ ఎక్స్‌టెన్షన్, శివప్రసాద్‌కాలనీలలో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎన్‌సీసీతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు


ఎన్‌సీసీడే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు(విద్య), నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని క్విజ్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ చక్రవర్తి అన్నారు. ఆదివారం ఒంగోలులోని క్విజ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీడేని పురస్కరించుకుని క్యాడెట్లు డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ తమ కళాశాలలో 80మంది క్యాడెట్లు ఉన్నారని, వారు ఎన్‌సీసీలో మంచి ప్రతిభను కనపరుస్తున్నారని తెలిపారు. ఆర్డీసీ క్యాంపుల్లోను, రైఫిల్ షూటింగ్, పలు రకాల శిక్షణలకు తమ విద్యార్థులు ఎంపికకావటం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ నిడమానూరి గాయిత్రీదేవి, ప్రిన్సిపాల్ హనుమంతరావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

మద్దిపాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటసూర్య తెలిపారు.

రుణాలను మాఫీ చేయాలి

మద్దిపాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల రుణాలను సమగ్రంగా మాఫీ చేయాలని రైతు సంఘం జాతీయ నాయకుడు చుండూరి రంగరావు డిమాండ్ చేశారు. ఆదివారం మద్దిపాడు నటరాజ కళాకేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు పంటల మద్దతు ధరను అమలు చేయాలన్నారు. రైతులకు వడ్డీలేని రుణాలను అందించాలన్నారు. విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల చేసి, గృహ వినియోగదారులకు నెలకు 300 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. కనపర్తి సుబ్బారావు మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జజ్జర శరత్‌బాబు, గంటా కోటేశ్వరరావు, గంగిశెట్టి నరసింహారావు, వెంకటేశ్వరరావు, నేలటూరి సత్యనారాయణ, నట్టే సుబ్బారావు, సూర్యనారాయణ, ఈమని సుబ్బారావు, బడితల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'మైనంపాటి'కి ఘన సన్మానం


సాయికుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత సాంస్కృతిక సమితి, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో ఒంగోలుకు చెందిన ఆధ్యాత్మికవేత్త, ఎర్రన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్‌ను ఘనంగా సత్కరించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలలో ఆదివారం సాయికుమార్ పాల్గొని తన కవితలను వినిపించారు. ప్రస్తుత సమాజంలోని పలు సమస్యలను ఆయన తన కవితలలో ప్రతిబింబించారు. ఈ సందర్భంగా తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్‌డీ.విల్సన్, ఉత్సవ కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ, జీవీ.పూర్ణచంద్, బిక్కి కృష్ణ తదితరులు సాయికుమార్‌ను శాలువతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

వృద్ధాశ్రమానికి వాటర్ ప్యూరిఫైర్ వితరణ


వాటర్ పూరిఫైర్‌ను అందజేస్తున్న దాతలు

ఒంగోలు నగరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం భరత్‌నగర్‌లోని వృద్ధాశ్రమానికి అమిగోస్ మ్యూజికల్ కాన్సర్ట్ సంస్థ ప్రతినిధులు ఆదివారం వాటర్‌ప్యూరిఫైర్‌ను అందజేశారు. డీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ వృద్ధాశ్రమంలోని వృద్ధుల కోసం వాటర్‌ప్యూరిఫైర్‌ను అందజేసినట్లు అమిగోస్ మ్యూజికల్ కాన్సర్ట్ సంస్థ వైస్‌ప్రెసిడెంట్ కొండెపు అశోక్ తెలిపారు. తమ సంస్థలోని వారి వేతనాల నుంచి కొంత సేకరించి సేవా కార్యక్రమాలను స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నామిన చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జయప్రదీప్, వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు శివ, కేర్ టేకర్ సునీత పాల్గొన్నారు.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకు మహిళలపై పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఈ నెల 25న అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవం నుంచి డిసెంబరు 10న మానవ హక్కుల దినోత్సవం వరకు జరిగే ప్రచార ఉద్యమాన్ని జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షురాలు ఎస్.డీ.షర్మిల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న ఘోరాలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించటం, సమగ్ర విచారణ, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుపై ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపటం లేదన్నారు. కార్యక్రమంలో జి.ఆదిలక్ష్మి, ఎస్‌కే.నాగూర్, కె.ప్రసన్న, కె.రాజేశ్వరి, బి.పద్మ, కె.ధనలక్ష్మి, పి.రత్నం, ఎస్.డి.ఖాదరున్నీసా, పి.రత్తమ్మ, పి.ప్రేమలత, రమీజ, అమీరున్నీసా, ప్రమీల, కె.శాంతకుమారి పాల్గొన్నారు.

ఒకరికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మారెళ్ళ చెరువు కట్ట వద్ద ఆదివారం కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గొర్రె శరత్, గొర్రె రాము ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కారు ఢీకొట్టింది. దీంతో శరత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు ఒంగోలుకు తరలించారు.

పశువులపై పులి పంజా



పెద్దపులి దాడిలో మృతి చెందిన ఆవు దూడ తలభాగం, కాళ్లు

వరుస దాడులతో పశుపోషకుల బెంబేలు

ఈ ఏడాదిలోనే అధికం

పరిహారం కాదు పరిస్థితి ఏంటి?

పులి సంచారప్రాంతాల్లోకి పశువులు వెళ్తున్నాయా?

జనావాసాల్లోకి పులులొస్తున్నాయా?

త్రిపురాంతకం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పశువులపై పులి పంజా విసురుతోంది. నల్లమల అటవీ ప్రాంతాల్లోని గూడేలు, గ్రామాల్లో ఆందోళన మళ్లీ మొదలైంది. దోర్నాల మండల పరిధిలోని బొమ్మలాపురం సమీపంలో తుంగుడు వాగు పరిసరాల్లో మేతకు వెళ్లిన ఆవులమందపై పులి దాడి చేసి ఆవుదూడను చంపడం మళ్లీ కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో ఇదే ప్రాంతంలో పశువులను చంపుకుతిన్న పులి మళ్లీ దాడి చేయడంతో ఆందోళన పెరిగింది. అయితే ప్రతిసారీ నష్టపోయిన పశుపోషకులకు పరిహారం అందించే అటవీ శాఖ అధికారులు ఈ ఘటనలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అయితే నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంచారం ఉన్న ప్రాంతాల్లోకి పశువులు వెళ్లకుండా చూడాలని అధికారులు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. కానీ పశువులు పులి సంచారం ఉన్న అటవీభాగంలోకి వెళుతున్నాయా? లేక పులులే పశువుల మేత ప్రాంతాల్లోకి వస్తున్నాయా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. అదే నిజమైతే పశు పోషకులకు అటవీ అధికారులు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించటం ఎంతైన ఉత్తమంగా పలువురు భావిస్తున్నారు.

ఈ ఏడాది వరుస ఘటనలు

ఈ ఏడాది వరుసగా జరుగుతున్న ఘటనలను బట్టి పులులు జనావాసాల్లోకి వస్తున్నాయనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. దోర్నాల పరిసరాల్లోనే ఈ ఏడాది దాదాపు 10 ఘటనలు చోటు చేసుకున్నాయి. మరోవైపు మిగతా చోట్ల జరిగిన వాటిని పరిశీలిస్తే ఏప్రిల్ 10వ తేదీన పెద్దారవీడు మండలం కలనూతల సమీపంలో ఆవుపై పెద్దపులి దాడిచేసి చంపింది. ఏప్రిల్ 30న మాగుటూరు తాండా సమీపంలో కూడా పెద్దపులి దాడిలో గేదె మృత్యువాత పడింది. మే 30వ తేదీన అర్ధవీడు మండలం పాపినేనిపల్లి సమీపంలో బొప్పాయితోటలో ఉన్న ఆవుపై పులి దాడిచేసి చంపింది. జూన్‌లో వరుసగా దాడులు జరిగాయి. జూన్ 6న మార్కాపురం మండలం గొట్టిపడియ సమీపంలో ఆవుపై పులి దాడిచేసి చంపింది. అదేనెల 10వ తేదీన అర్ధవీడు మండలం బొల్లుపల్లికి చెందిన రైతు నాగేశ్వరరావు ఎద్దును పులి చంపింది. 13న ఎర్రగొండపాలెం మండలం పాలుట్ల గూడెం సమీపంలో పెద్దపులి దాడిలో రెండు ఆవులు మృతి చెందాయి. 15 రోజుల వ్యవధిలో 28వ తేదీన మళ్లీ పాలుట్లలో రెండోసారి పులి దాడికి రెండు ఆవులు బలయ్యాయి. ఇప్పుడు దోర్నాల పరిసరాల్లో ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

పెద్దపులి దాడిలో ఆవు దూడ మృతి

పెద్ద దోర్నాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పెద్దపులి దాడిలో ఆవు దూడ మృతి చెందిన ఘటన నల్లమల అభయారణ్యంలోని తుంగూరు బావి ప్రాంతంలో ఆలస్యంగా ఆదివారం వెలుగు చూసింది. అటవీ శాఖాధికారులు విధి నిర్వహణలో భాగంగా అడవిలో సంచరిస్తుండగా ఆవు దూడ తల భాగం, కాళ్లు కనిపించాయి. దీంతో పెద్దపులి దాడి చేసినట్టుగా భావించారు. అయితే రెండు రోజుల కిందట జరిగి ఉండవచ్చని, మృతి చెందిన ఆవుదూడ సమీప గ్రామాలైన పెద్ద బొమ్మలాపురం, బోడేనాయక్ తాండాకు చెందినదిగా భావిస్తున్నారు. పెద్దపులి తిరిగే ప్రాంతానికి పశువులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

జంగిల్ సఫారీలో నల్లమల టైగర్

అటవీ ప్రాంతంలో కనిపించిన వైనం

పర్యాటకులు ఖుషీఖుషీ

పెద్ద దోర్నాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతం అందాలను దగ్గర నుంచి వీక్షించిన జంగిల్ సఫారీ ప్రియులు ఆదివారం ఖలేఖుషీ అయ్యారు. పచ్చని తివాచి పరిచినట్లుగా ఉండే పచ్చికతో పాటు ఎత్తైన వృక్ష సంపద, కిచకిచ మంటూ పిచ్చుకల శబ్దం అప్పుడప్పుడూ వినిపించే కోయిలరాగాలు.. అక్కడక్కడా గుంపులుగా ఆహార సేకరణలో నిమగ్నమయిన నెమళ్లు, బిత్తర చూపులతో గెంతే జింకల సమూహాన్ని తిలకించిన అనుభవాలు చాలా మంది పర్యాటకులకు ఉన్నాయి. కానీ ఆదివారం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జంగిల్ ప్రయాణంలో అద్భుతం చోటుచేసుకుంది. ప్రకృతి ప్రేమికులకు ఏకంగా పెద్ద పులి కనిపించడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఒక్కసారి కాదు మూడు సార్లుగా వెళ్లిన పర్యాటకులకు పులి కనిపించింది. ఇప్పటి వరకు వివిధ మాధ్యమాల్లో చూడడం తప్ప వాటి స్థానాల్లోకి వెళ్లి దగ్గరగా చూడడం సంతోషంగా ఉందని పర్యాటకులు భావిస్తున్నారు. అభయారణ్యం అనగానే గుర్తుకు వచ్చేది పెద్దపులి తర్వాత వన్యప్రాణులు. తమకళ్లముందు ప్రత్యక్షం కాగానే ఒకింత భయం, మరో పక్క చెప్పలేని సంతోషం. అనుకుంటూ చరవాణిలో బంధించిన పులిని తమ బంధువులు, మిత్రులకు షేర్ చేస్తూ సంబరపడిపోతున్నారు.



నల్లమలలో పర్యాటకులకు కనిపించిన పెద్దపులి



ఆటోనగర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి, వేదికపై ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర, మారిటైం బోర్డు చైర్మన్ సత్య, మేయర్ సుజాత తదితరులు

ఆటోనగర్ అభివృద్ధికి కృషి

● రూ.10.95 కోట్ల పనుల శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి స్వామి

ఒంగోలు(రూరల్),నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో చేసే ప్రతిపని పేదవారి అభివృద్ధికి తోడ్పడాలని సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలు నగరం త్రోవగుంటలోని ఆటోనగర్‌లో ఆదివారం రూ. 10.95 కోట్లతో అభివృద్ధిపనులకు శిలాఫలకం ఆవిష్కరణ జరిగింది. ఈకార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి డోలా మాట్లాడుతూ గతప్రభుత్వం చేసిన చర్యలతో పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేయటానికి ఆలోచిస్తున్నారని అన్నారు. తమ ప్రభుత్వం పూర్తి భరోసాతో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని అన్నారు. సూచించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ఆటోనగర్‌లో తాగునీటి పనులకు తన వంతుగా రూ. 23 లక్షల ఎంపీ నిధులు నుంచి కేటాయిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఎంఎల్‌ఏ దామచర్ల జనార్దనరావు మాట్లాడుతూ సంవత్సరం లోపు చేపట్టిన పనులు పూర్తి చేయాలని, అందుకు ఆటోనగలోని నాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు. సిమెంట్‌రోడ్లు,సైడు కాలువలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఆశాఖ అధికారులతో మాట్లాడి నూతన స్తంభాలు, వైరుతో పనులు చేయిస్తానని తెలిపారు. ఏపీఐఐసీ చైర్మన్ ఎం.రామరాజు మాట్లాడుతూ ఆటోనగర్‌లో ఇప్పటికీ మిగిలి ఉన్నస్థలాలలో పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కనిగిరి ఎంఎల్‌ఏ ఉగ్ర నరసింహారెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, ఎఫ్ఎస్ఎంఈ అధ్యక్షుడు ఏపీకే రెడ్డి, ఆటోనగర్ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

బండ్లమూడి కేసులో ఐదుగురు అరెస్టు

ఒంగోలు క్రైం,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బండ్లమూడి కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈకేసులో గోపిరెడ్డి బాల ఓబులురెడ్డి, వనిపెంట శ్రీనివాసరెడ్డి, వనిపెంట రమణారెడ్డి, వనిపెంట ఏడుకొండలు, పెమ్మ సంజీవిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

మార్మోగిన సత్యసాయినామం

ఘనంగా జయంతి వేడుకలు

ప్రభుత్వ, ఆధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు

మంత్రి డాక్టర్ స్వామి, ఇతర ప్రజా ప్రతినిధుల హాజరు

ఒంగోలు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆదివారం సత్య సాయినామ స్మరణ మార్మోగింది. భగవాన్ సత్యసాయి శతజయంతి వేడుకలను ప్రభుత్వపరంగా అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు ఇవ్వడంతో జిల్లావ్యాప్తంగా యంత్రాంగం వేడుకలను నిర్వహించింది. మరోవైపు సత్యసాయి భక్తబృందం, వివిధ ధార్మిక సంస్థలు ఆధ్వర్యంలోనూ వేడుకలు భారీగా జరిగాయి. పలుచోట్ల ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు పెద్దఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహించారు. సత్యసాయి మందిరాలలో వైద్య శిబిరాలు, అన్నదానం, ఇతర కార్యక్రమాలతోపాటు సాయి భజనలు నిర్వహించగా పలుచోట్ల రోగులకు, పేదలకు ధార్మిక సంస్థలు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వపరంగా అధికారికంగా శతజయంతి వేడుకలు నిర్వహించడంతో పలుచోట్ల కీలక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో సత్యసాయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్‌లో జిల్లా యంత్రాంగం తరపున నిర్వహించిన సత్యసాయి శతజయంతి వేడుకలలో మంత్రి డాక్టర్ స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి ఆధ్యాత్మికతను సేవ వైపు మళ్లించిన మహనీయుడని కొనియాడారు. విశ్వశాంతికి సత్యసాయి బోధనలు స్ఫూర్తిని ఇస్తాయని ప్రజలందరూ ఆయన మార్గంలో పయనించాలన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, జేసీ గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాత తదితరులు పాల్గొన్నారు. నగరంలోని రిమ్స్ హాస్పటల్‌లో సత్యసాయిసేవాసమితి నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ మాగుంట పాల్గొని పేషెంట్లకు దుప్పట్లు పంపిణీ చేశారు. మార్కాపురం పట్టణం ఎన్.ఎస్.నగర్‌లోని సత్యసాయి మందిరంలో జరిగిన కార్యక్రమంలో అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పాల్గొని బాబా శతజయంతి కేక్‌ను కట్ చేశారు. దర్శి మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన సత్యసాయి జయంతి వేడుకల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. గిద్దలూరులో జరిగిన వేడుకల్లో అక్కడి ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా అనేక ప్రభుత్వ కార్యాలయాలోను సత్యసాయి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సత్యసాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి వివిధ స్థాయిలోని అధికారులు సిబ్బంది నివాళులర్పించారు.



ఎన్ఎస్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి , గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

సేవకు ప్రతిరూపం 'ఎన్ఎస్'

● ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్య అధ్యాత్మిక రంగాల్లో, సామాజిక రంగాల్లో ఎన్ఎస్ అందించిన సేవలు ఎంతో గొప్పవని ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎన్ఎస్ కల్యాణ మండపంలో ఎన్ఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, పారిశ్రామికవేత్త నాదెళ్ల సుబ్రహ్మణ్యం సంతాప సభ గోపాలుని హరిహరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో విద్యాసంస్థలు స్థాపించి ఈ ప్రాంత అభివృద్ధికి ఎన్ఎస్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన కుటుంబంతో తమకు ఎంతో సాన్నిహిత్యం ఉందన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్ఎస్ మరణం ఈ ప్రాంతానికి తీరని లోటన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ..అంచెలంచెలుగా వ్యాపార రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్న గొప్ప వ్యక్తి ఎన్ఎస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ విద్యాసంస్థల చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎన్వి రమణ, ఎస్వీకేపీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ బచ్చలకూరి డెవిడ్‌సన్, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా యోగా రాష్ట్రస్థాయి పోటీలు

● పోటాపోటీగా ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్‌లో ఆసనాల ప్రదర్శన



ట్రెడిషనల్‌లో యోగాసనాలు ప్రదర్శిస్తున్న మూడు జిల్లాల బాలురు (ఇన్‌సెట్లో) బాలికల ఆసనాలు

పంగులూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని చందలూరు గ్రామంలో ప్రారంభమైన యోగా రాష్ట్రస్థాయి పోటీలు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. వివిధ జిల్లాలకు చెందిన అండర్-14, అండర్ -17 విభాగాలలో బాలురు, బాలికలు నిర్ణీత సమయంలో తమ క్రీడానైపుణ్యం చాటేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్ , రిథమిక్ విభాగాలలో ఆయా జిల్లాల బాలురు, బాలికలు వివిధ ఆసనాలు ప్రదర్శిస్తున్న తీరు వీక్షకులకు కనువిందు చేస్తోంది. పోటీలను రాష్ట్ర పరిశీలకుల పర్యవేక్షణలో ఎన్ఎస్ఐ శిక్షణ పొందిన 30 మంది న్యాయనిర్ణేతలు ఆయా విభాగాలలో క్రీడాకారుల ప్రతిభను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా ఫలితాలను సోమవారం వెల్లడించనున్నట్లు పరిశీలకులు పూర్ణచందరరావు, రాజ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి తెలిపారు. అండర్ -19 బాలురు, బాలికలకు సోమవారం నాలుగు విభాగాలలో పోటీలు జరుగుతాయని పరిశీలకులు తెలిపారు. ఆదివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెళుతురులో ఆసక్తిగా కొనసాగుతున్న పోటీలను తిలకించేందుకు గ్రామస్థులు అధికసంఖ్యలో తరలిరావడంతో పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. విశ్రాంత హెచ్ఎం నార్నె తాతయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

'పది' పరీక్షలకు 29,117 మంది విద్యార్థులు

● అపరాధ రుసుంతో 30 వరకు ఫీజు గడువు

● ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు

ఒంగోలు(విద్య), నవంబరు23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే ఏడాది మార్చి16 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పబ్లిక్‌పరీక్షలకు మొత్తం 29,117 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 17,380 మంది, ప్రయివేటు పాఠశాలల నుంచి 11,737 మంది హాజరవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి బాలికలు, ప్రయివేటు పాఠశాలల నుంచి బాలురు అధికసంఖ్యలో పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 7,851 మంది బాలురు, 9,529మంది బాలికలు, ప్రయివేటు పాఠశాలల నుంచి 6,793 మంది బాలురు, 4,944మంది బాలికలు హాజరవుతున్నారు. ఎటువంటి అపరాద రుసుము లేకుండా ఈనెల 30లోపు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు ప్రభుత్వపరీక్షల డైరెక్టర్ అవకాశం కల్పించారన్నారు. పరీక్షలకు హాజరువుతున్న విద్యార్థుల వివరాలను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌ల కార్యాలయం నేరుగా విద్యార్థుల యుడైస్ నుంచి తీసుకుంటున్నందన యుడైస్‌లో వారి వివరాలను అప్‌డేట్ చేయాలని ఆయన ప్రధానోపాధ్యాయులను కోరారు. ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుతో పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నందున అనుమానాల నివృత్తికి, సమస్యల పరిష్కారానికి, పరీక్షల విభాగంలో ప్రత్యేకంగా గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజు 125రూపాయలు మాత్రమే వసూలు చేయాలని శ్రీనివాసరావు సూచించారు.

సంస్కృతాంధ్ర భాషల వికాసానికి గోరంట్ల వెంకన్న కృషి

● హిందూధర్మ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ దాసరి శ్రీనివాసులు

నాగులుప్పలపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంస్కృతాంధ్ర భాషల వికాసం, ఆయుర్వేద వైద్యవ్యాప్తికి తన యావదాస్తిని దానం చేసిన మహోన్నత వ్యక్తి గోరంట్ల వెంకన్న అని హిందూధర్మ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్, పూర్వపు జిల్లా కలెక్టర్ దాసరి శ్రీనివాసులు పేర్కొన్నారు. తిమ్మసముద్రం గ్రామానికి చెందిన గోరంట్ల వెంకన్న ట్రస్ట్, ఓరియంటల్ కళాశాల వ్యవస్థాపకుడు గోరంట్ల వెంకన్న 78వ వర్ధంతిని ట్రస్ట్ వ్యవస్థాపక ధర్మకర్త గోరంట్ల పెదవీరయ్య ఆధ్వర్యంలో స్థానిక ఓరియంటల్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మ సంస్కృతిలో తెలుగుభాష అధ్యయనం, ఆయుర్వేద వైద్యం దేశవ్యాప్తం చేసేందుకు నాడు గోరంట్ల వెంకన్న విశేష కృషి చేసి ఆంధ్రరాష్ట్రంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. ఐఆర్ఎస్ అధికారి కొప్పవరపు సత్యశేషశైలేంద్ర మాట్లాడుతూ ట్రస్ట్ సేవలను విస్తృతం చేయాలని కోరారు. తొలుత గోరంట్ల వెంకన్న విగ్రహం, చిత్రపటాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ తాళ్లూరి ఆంజనేయులు, దుర్భా శ్రీరామచంద్రమూర్తి, జాస్తి వాణి, ఒలుకుల శివశంకర్, ముళ్లపూడి విశ్వనాథశాస్త్రి, కొలసాని వెంకట్రావు, ముళ్లపూడి వసంతలక్ష్మి, బొల్లినేని కోటేశ్వరరావు, అన్నదానం చిదంబరంశాస్త్రి, సూరం శ్రీనివాసులు, గోరంట్ల చినరామయ్య, మేళ్లచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి, శిష్టి లక్ష్మీకుమారశర్మ, ఈమని వెంకట సత్యనారాయణలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఇదే కళాశాలలో చదివి ఇటీవల మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ కొలువులు సాధించిన 14మందిని సత్కరించారు. అలాగే ఇమ్మడిశెట్టి జాన్విత భరతనాట్యం ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకొంది. కోలాట ప్రదర్శన, డీజే చప్పుళ్ల మధ్య వెంకన్న చిత్రపటాలను పుర వీధుల్లో ఊరేగించారు. కళాశాల పూర్వ విద్యార్థి, శతావధాని నారాయణం బాలసుబ్రమణ్యంచే అష్టావధానం నిర్వహించారు. ట్రస్ట్ కార్యనిర్వహణాధికారి వెలగం శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యాదాత వెంకన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు,ట్రస్ట్ వ్యవస్థాపక ధర్మకర్త గోరంట్ల పెద వీరయ్య, తొలితరం కళాశాల అధ్యాపకులు

సాగర్ కాలువలో పడి సచివాలయ ఉద్యోగి మృతి

త్రిపురాంతకం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు సాగర్ కాలువలో పడి సచివాలయ ఉద్యోగి మృతిచెందారు. మండలంలోని దూపాడుకు చెందిన ముక్తిపూడి అనిల్‌కుమార్ (36) శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్లి ఇంటికిరాలేదు. దీంతో సాగర్ కాలువ వద్ద అతని చెప్పులు గుర్తించి కాలువలో పడినట్టు అనుమానించారు. తహసీల్దార్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్ అధికారులతో కలసి కాలువ వెంబడి గాలించగా ఆదివారం హసానాపురం వద్ద మృతదేహాన్ని కనుగొని వెలికితీశారు. అనిల్‌కుమార్ దొనకొండ మండలం పోలేపల్లి గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మర్రిపాలెం గూడేనికి దారేది


వరద నీటికి కొట్టుకుపోయిన రాళ్లవాగుపైన చప్టా


మర్రిపాలెంకు వెళ్లే ప్రధాన దారి

- శ్రీశైలం - దోర్నాల ఘాట్ రోడ్డు నుంచి 7కిలోమీటర్ల ప్రయాణం
- అభయారణ్యంలో క్రూర జంతువుల దాడులు
- వరద నీటికి కొట్టుకుపోయిన రాళ్లవాగుపై చప్టా
- అవస్థలు పడుతున్న చెంచు గిరిజనులు

పెద్ద దోర్నాల,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రహదారులు అభివృద్ధికి చిహ్నాలు అంటారు. చంద్రమండలానికి సైతం దారులు వెతికే నేటి ఆధునిక యుగంలో తరతరాలుగా నివాసముంటున్న గ్రామానికి సరైన రహదారి లేక అక్కడి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐటీడీఏ ఉన్నా ఫలితం మాత్రం సున్నా. పైగా పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా అన్ని గూడేలకు మౌలికవసతులు సమకూర్చుతామని సంబంధిత అధికారులు రెండేళ్లుగా అవగాహన సమావేశాలు పల్లెవేశారు. ఏపాటి వసతులు సమకూర్చారో మాకు తెలియదని పలువురు గిరిజనులు అంటున్నారు.

మర్రిపాలెం వెళ్లాలంటేనే జంకు

మండలంలోని మర్రిపాలెం గిరిజన చెంచు గూడెం శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డుకు 7 కిలోమీటర్ల దూరంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఏర్పడింది. ఆ గ్రామంలో 124 కుటుంబాలు నివశిస్తున్నాయి. నేటికీ గ్రామానికి వెళ్లేందుకు ప్రధాన రహదారి సక్రమంగా లేదు. ఆ గ్రామంలో ఆశ్రమ పాఠశాల ఉంది. ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లాలన్నా, పిల్లలకు నిత్యావసర సరుకులు తీసుకు వెళ్లాలన్నా ఇబ్బందికరంగా మారింది. అభయారణ్యంలో ఏపుగా పెరిగిన చెట్లు, ముళ్ల పొదలు మధ్యగా అక్కడక్కడ కాలువలు పడిన దారిలో బిక్కు బిక్కు మంటూ ప్రయాణించాల్సి వస్తోంది. అంతే కాదు పొదల మధ్య నుంచి ఎలుగుబంట్లు దాడిచేసి గాయపర్చిన ఘటనలు కూడా ఉన్నాయి. అందుకే ఒకరిద్దరు ప్రయాణించలేక గుంపులుగా వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెప్తున్నారు. అదంతా రోజువారి సమస్య కాగా వర్షాలు కురిస్తే కలిగే ఇబ్బందులు చెప్పలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి వెళ్లాలంటే శ్రీశైలం రోడ్డు నుంచి కిలోమీటరు దూరంలో రాళ్లవాగుపై చిన్నపాటి చప్టా ఉంది. అయితే వర్షాకాలం వానలు ఎక్కువగా కురిస్తే వాగు ఉధృతి పెరిగి చప్టా మీదుగా వరద ప్రవహించడంతో పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ ఏడాది కురిసిన మొంథా తుఫాన్ దాటికి రాళ్లు బయట పడ్డాయి. వాహనాలు గ్రామానికి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఇంటి సరుకులు, వ్యవసాయ సామగ్రి, ఉత్పత్తులు తరలించేందుకు కష్టతరంగా మారిందని చెంచు గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధి తఅధికారులు స్పందించి రహదారి పటిష్ట పరచాలని, రాళ్లవాగుపై బ్రిడ్జి నిర్మించాలని చెంచు గిరిజనులు కోరుతున్నారు.

ఎంపీడీవోగా ప్రసూనదేవి



పెద్ద దోర్నాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ప్రసూనదేవి ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు.గతంలో ఎంపీడీవోగా విజయ విధులు నిర్వహిస్తోంది. దోర్నాల అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న ప్రసూనదేవి ఎంపీడీవోగా పదోన్నతిపై చీరాలలో విధుల్లో చేరింది. కాగా ఇద్దరి పరస్పర అవగాహనతో డిప్యుటేషన్‌పై విజయ చీరాల వెళ్లగా చీరాలలో ఎంపీడీవోగా చేరిన ప్రసూన దేవి దోర్నాలకు వచ్చారు.

నేటి నుంచి రైతన్నా మీకోసం

పెద్దదోర్నాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతన్నా మీ కోసం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఏవో జవహర్‌లాల్‌నాయక్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ నుంచి 29వ తేదీ వరకు గ్రామ స్థాయిలో నిర్వహించే గ్రామ సభల్లో వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై అధికారులు అవగాహన కల్పించనున్నట్లు ఆయన చెప్పారు.


రైతుకు పత్రాలను అందిస్తున్న ఎంపీడీవో రాజ్‌కుమార్

గొల్లపల్లిలో స్వామిత్వ గ్రామసభ

త్రిపురాంతకం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొల్లపల్లిలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ ఓబులరెడ్డి వెంకటతిరుమలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆస్తులపై స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడానికి స్వామిత్వ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇది ఆర్థిక స్వాలంబన, బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు.

అర్బన్ కాలనీలో సమస్యలపై ఎంపీకి వినతి


ఎంపీ మాగుంటకు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ ఎన్‌ఆర్‌ఐ రఫి

కంభం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం కంభం అర్బన్ కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి కంభం టీడీపీ ఎన్‌ఆర్‌ఐ రఫి వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఆయన ఒంగోలు ఎంపీని కలిసి కంభం అర్బన్ కాలనీని 1985లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మంజూరు చేశారన్నారు. అర్బన్ కాలనీలో ప్రస్తుతం 2వేలకు పైగా కుటుంబాలు ఉన్నాయని అందరూ నిరుపేద కుటుంబాల వారని తెలిపారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు సక్రమంగా లేకపోవడంతో ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ కారణంగా వర్షపు నీరంతా నివాస గృహాలలోకి వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అర్బన్ కాలనీలో అంతర్గత సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలను మంజూరు చేయాలని కోరారు.

నేడు ఫ్యాప్టో చైర్మన్ గిద్దలూరు రాక

గిద్దలూరు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) చైర్మన్ 24వ తేది సోమవారం గిద్దలూరు రానున్నట్లు ఎస్టీయూ అధ్యక్షుడు ఎర్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6గంటలకు పట్టణంలోని విశ్వభారతి హైస్కూలులో జరిగే కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాసరావు పాల్గొంటారని, ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

పోలేరమ్మకు ప్రత్యేక బోనాలు



మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యే బోనాలు, జాతర నిర్వహించారు. అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌ను పూల మాలలు నిమ్మకాయ దండలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లు వంటి నైవేద్యం సమర్పించారు. పాముల పుట్టలో పాలు పోసి నాగ దేవతలకు పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశుల రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తర్లుపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేకలవారిపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ హనుమాన్ నాయక్ తెలిపారు. విద్యుత సరఫరా ఉండని గ్రామాలు మేకలవారిపల్లి, కలుజువ్వలపాడు, రాగిసముద్రం, కొండారెడ్డిపల్లి, లక్ష్మక్కపల్లి, జంగంరెడ్డిపల్లిలు తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

ఎమ్మెల్యే కందుల


డీప్‌బోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ పరిధిలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. 17వ వార్డు పరిధిలోని భగత్ సింగ్ కాలనీ సమీపంలో గత ఆరు సంవత్సరాల నుంచి పనిచేయని డీప్‌బోర్‌కు మున్సిపాలిటీ అధికారులు మరమ్మతులు చేయించారు. అంతేకాక మరికొంతమేర పైప్‌లైన్ వేయించి వార్డు ప్రజలకు సాధ్యమైన మేర ఎక్కువ మందికి నీటిని అందించేందుకు చర్యలు చేయపట్టారు. పూర్తైన పనులను ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించి ప్రజలకు నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా ఉదయం ఎమ్మెల్యే స్వగృహంలో ముస్లిం మత పెద్దలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు, మౌజన్‌లు మాట్లాడుతూ కొన్ని మసీదులకు అధికారికంగా రిజిస్ట్రేషన్‌లు లేవని తెలిపారు. ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి జయంతి ఉత్సవాలు


పేదలకు దుస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


కంభం ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు

గిద్దలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతవర్ష జయంతి ఉత్సవాలు స్థానిక ప్రేమసుధా మందిరంలో అత్యంత వైభవంగా జరిగాయి. 5 రోజులుగా జరుగుతున్న జయంతి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, తహసీల్దార్ అంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఎంఈవోలు అశ్వనీకుమార్, నాగభూషన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్ రెడ్డి, టీడీపీ నాయకులు ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి, పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, దప్పిలి కాశిరెడ్డి, సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, అమ్మవారిశాల అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ పాల్గొని పూజలు నిర్వహించారు. సత్యసాయి బోధనల గురించి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వివరించారు. పేదలకు నూతన వస్త్రాలను, నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అందచేశారు. కాగా బీజేపీ నాయకులు సైతం సత్యసాయి జయంతి ఉత్సవాలలో పాల్గొని పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీలో పని చేసే పారిశుధ్య కార్మికులందరికీ సత్యసాయి సేవాసమితి సమకూర్చిన దుస్తులను కమిషనర్ రమణబాబు అందచేశారు. జయంతి ఉత్సవాలలో భాగంగా ప్రేమసుధా మందిరంలో సామూహిక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

మార్కాపురం వన్‌టౌన్ : ప్రేమ తత్వమే మానవత్వమని సమానత్వమే సత్యసాయి తత్వమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఎస్ఎస్ నగర్‌లోని భాగవన్ సత్యసాయి మందిరంలో బాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై సత్యసాయి బాబా చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సత్యసాయి సేవా సమితి, భక్తులు పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కమిషనర్ డీవీఎస్ నారాయణ రావు, కౌన్సిలర్ నాలి కొండయ్య పాల్గొన్నారు.

తర్లుపాడు : సత్యసాయి చిత్రపటానికి తహసీల్దార్ కేకే కిషోర్‌కుమార్, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ చరణ్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీరెడ్డి, వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రాచర్ల : సత్యసాయి బోధలు అందరూ ఆచరించాలని ఎంపీడీవో వెంకటరామిరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం నాయకులతో కలిసి సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో స్వామి, జూనియర్ అసిస్టెంట్ రాజ్ కుమార్, ఎఫ్ఏ లక్ష్మీనారాయణ, రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పోరేషన్ డైరెక్టర్ యోగానంద్, కాశిరెడ్డి, సనావుల్లా ఖాన్ పాల్గొన్నారు.

పెద్దారవీడు : పుట్టపర్తి సాయిబాబా సేవాతత్పరత ఆచరణీయమని ఎంపీడీవో జాన్‌సుందరం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం సత్యసాయి శత జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకం : సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలను అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్‌కుమార్ గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. సత్యసాయి చిత్రపటానికి పూలమాలవేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వెలుగు, ఉపాధిహామీ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

కంభం : సత్యసాయి జయంతి వేడుకలను ఎంపీడీవో వీరభద్రాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో పసుపులేటి రంగయ్య, కార్యదర్శి రమేష్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : సత్యసాయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ సర్దార్, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్, వీఆర్వోలు నాసర్‌వలి. రాంబాబు, సత్యనారాయణ, పొతులూరయ్య, జూనియర్ అసిస్టెంట్ కృష్ణా, కంప్యూటర్ ఆపరేటర్ రత్నం పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : సత్యసాయి మందిరంలో తహసీల్దారు అశోక్ కుమార్ రెడ్డి పంచాయతీ కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో ఏడుకొండలు, సంస్థ సభ్యులు శేఖర్, రంగారావు పాల్గొన్నారు.


వైపాలెంలో నివాళులర్పిస్తున్న అధికారులు


రాచర్లలో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో వెంకటరామిరెడ్డి


బహుమతులతో విద్యార్థులు

విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు

గిద్దలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాఖ గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమంలో భాగంగా క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో సిరివెన్నెల, భవ్య హన్సిక, సీనియర్స్ విభాగంలో భార్గవి, నస్రిమ్, అభినయశ్రీలు విజేతలుగా నిలువగా యువప్రగతి పథం సభ్యులైన కిశోర్ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థులు


బహుమతులను అందుకుంటున్న విద్యార్థులు

గిద్దలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్టులో గిద్దలూరుకు చెందిన సూర్యవిద్యానికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరచి మొదటి స్థానంలో నిలిచారు. దర్శిలోని ఝాన్సీ విద్యాసంస్థలో జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించగా ఇంగ్లీషు మీడియం విభాగంలో 26 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సూర్యవిద్యానికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరచి జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి బహుమతులను అందుకున్నారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ బ్రహ్మానందరెడ్డి, డైరెక్టర్ పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్జీవో సంఘ అధ్యక్షుడిగా నరేష్‌బాబు


గిద్దలూరు ఎన్జీవో సంఘ నూతన కార్యవర్గం

గిద్దలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవో అసోసియేషన్ గిద్దలూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్జీవో హోంలో ఆదివారం నామినేషన్ల దాఖలు కార్యక్రమం నిర్వహించగా ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్‌ను దాఖలు చేయడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి ఒంగోలు తాలూకా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు కె.మంగేష్ తెలిపారు. అధ్యక్షుడిగా టి.నరేష్‌బాబు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాధ్యక్షుడిగా ఆవులయ్య, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జునరెడ్డి, ఐఎస్.తీర్థులు, టి.శ్రీనివాసులు, కార్యదర్శిగా కాశిరమణ, సంయుక్త కార్యదర్శులుగా రామయ్య, హసీన, టిఎంఎస్ రెడ్డి, మహిళ సంయుక్త కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ఎన్జీవో సంఘ నాయకులు హాజరయ్యారు.

బాధిత కుటుంబానికి బలిజ సంఘం సాయం


చెక్కును అందజేస్తున్న బలిజ సేవా సంఘ సభ్యులు

కంభం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కందుకూరు నియోజకవర్గం దారకానిపాడుకు చెందిన తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో ఆయన సోదరుడు తిరుమలశెట్టి పవన్‌కుమార్ నేటికీ మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న శ్రీ కృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం, కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల శాఖ ఆ కుటుంబానికి చేయూతనందించింది. సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ.26,449ను ఆదివారం బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సూరె ప్రసాద్, ఉపాధ్యక్షుడు తోట కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు పులి శ్రీనివాస ప్రసాద్, ఉపాధ్యక్షులు కురంగి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


రాజేష్

రాచర్ల, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఆకవీడు పంచాయతీ పరిధిలోని ఆరవీటికోట గ్రామ పొలాల్లో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కే రాజేష్ (30) తన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ ఫీజు వేసుకుంటూ కటింగ్ బ్లేడ్ విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ పీ కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని రాజేష్ మృతికిగల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకొని కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విద్యుత్ శాఖ ఏఈ కె బాల గురవయ్య ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. రాజేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సీనియర్ విలేకరి మృతి


ఖాదర్‌బాబు

బేస్తవారపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట సీనియర్ జర్నలిస్టు షేక్ ఖాదర్‌బాబు(48) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలలో 26 ఏళ్లపాటు పలు పత్రికల్లో విలేకరిగా పనిచేశారు. ఇంట్లో నిద్రపోతూ ఆదివారం మధ్యాహ్నం గుండెపోటు గురయ్యారు. వెంటనే కంభం వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందారు. సోమవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఖాదర్‌బాబు మరణవార్త తెలిసిన వెంటనే ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ, కార్యదర్శి కనకయ్య, పలువురు విలేకరులు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

కాశీనాయన గుడి నిర్మాణానికి భూమిపూజ

పామూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుమునిగిరి క్షేత్రం సమీపంలో కాశీనాయన రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అవధూత భగవాన్ శ్రీకాశీనాయన స్వామి దేవస్థాన నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో రెడ్ల సంక్షేమ సంఘం నాయకులు బోయిళ్ల నారాయణరెడ్డి, తుమ్మా కొండారెడ్డి, ఇర్రి కోటిరెడ్డి, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, జి.వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను వాడొద్దు!

పామూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లను విడనాడి, గుడ్డ సంచులను వినియోగించాలని జేవీవీ నాయకుడు షేక్ నాయబ్‌రసూల్ పిలుపునిచ్చారు. జేవీవీ ఆధ్వర్యంలో తయారుచేయించిన గుడ్డ సంచులను ఆదివారం పట్టణంలో పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పర్యావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. దీని నివారణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సయ్యద్ చినమౌలాలి, సీహెచ్ మురళి, గద్దె సుధాకర్, టి. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

పామూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను కాలరాస్తూ బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి హెచ్చరించారు. మండలంలోని పడమర కట్టకిందపల్లి ఎస్సీ కాలనీలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల చట్టం ప్రకారం అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బి.విమల, పి.పద్మావతి, టి.పద్మ, షేక్ రజియా, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ చెరువు కట్ట వద్ద ఆదివారం కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గొర్రె శరత్, గొర్రె రాము ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో శరత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు. స్వల్పంగా గాయపడిన రామును అద్దంకిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి తీసుకువచ్చారు.

ద్విచక్ర వాహనచోదకుడికి గాయాలు

ముండ్లమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు వద్ద ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి ఒకరికి గాయాలయ్యాయి. వేంపాడు ఎస్సీ కాలనీకి చెందిన ద్విచక్ర వాహన చోదకుడు ఇంటికి వెళ్తూ నడిచి వెళ్తున్న వ్యక్తిని గమనించక ఢీకొట్టాడు. ఈక్రమంలో బైకు నుంచి కిందపడటంతో గాయాలయ్యాయి.

ఎన్‌సీసీతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు

ఒంగోలు(విద్య), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని క్విజ్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి అన్నారు. ఆదివారం ఒంగోలులోని క్విజ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీడేని పురస్కరించుకుని క్యాడెట్లు డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ తమ కళాశాలలో 80మంది క్యాడెట్లు ఉన్నారని, వారు ఎన్‌సీసీలో మంచి ప్రతిభను కనపరుస్తున్నారని తెలిపారు. ఆర్డీసీ క్యాంపుల్లోను, రైఫిల్ షూటింగ్, పలు రకాల శిక్షణలకు తమ విద్యార్థులు ఎంపికకావటం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ నిడమానూరి గాయిత్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'టాలెంట్ సెర్చ్' పోటీలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి నెలా టాలెంట్ సెర్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మరో గ్రంథాలయ ఉద్యమ కన్వీనర్ మంచికంటి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం ఒంగోలు నగరంలో ఇందుకు సంబంధించిన వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా టాలెంట్ సెర్చ్ వర్క్ షాప్ నిర్వహించి ప్రతిభావంతులను ఎంపికచేసి ప్రోత్సహిస్తామని చెప్పారు.

అధ్వానంగా తాళ్లూరు - శివరాంపురం రోడ్డు

- భారీ వాహనాలతో దెబ్బతిన్న వైనం
- మరమ్మతుల గురించి పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



తాళ్లూరు-వెల్లంపల్లి మార్గంలో రోడ్డు దుస్థితి

తాళ్లూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో తాళ్లూరు - శివరాంపురం రోడ్డు అధ్వానంగా మారింది. ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డు తాళ్లూరు నుంచి వెల్లంపల్లి వరకు ఉంది. బీటీ రోడ్డు మెటల్ రోడ్డును తలపిస్తుంది. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు తాళ్లూరు ప్రాంత ప్రజల రవాణా సౌకర్యార్థం సింగిల్ రోడ్డుగా ఉన్న ఈరహదారిని డబుల్ రోడ్డుగా మార్పుచేసి నిధులు మంజూరుచేశారు. దీంతో రోడ్డు నిర్మాణం చేపట్టగా 2018లో పూర్తయింది.

ప్రస్తుతం తాళ్లూరు మండలంలో గుండా బీకేవీ హైవే రోడ్డు నిర్మాణ పనులు గత ఏడాదిగా జరుగుతున్నాయి. సమీప కొండ మట్టిని రోడ్డు నిర్మాణం కోసం భారీ వాహనాల్లో ఈరోడ్డు గుండా తరలిస్తున్నారు. శివరాంపురం శివారున సాగర్ కాలువ కట్ట మీదుగా కొండకు నిత్యం వందలాది టిప్పర్లు తిరుగుతున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో తాళ్లూరు-శివరాంపురం సాగర్ కాలువ వరకు గల తారు రోడ్డు అధ్వానంగా మారింది. ఈమార్గంలో గుంతలు పూడుస్తూ మెటల్ వేయటంతో తారు రోడ్డు కాస్త మెటల్‌రోడ్డుగా మారింది. ఈమార్గం గుండా ద్విచక్రవాహనదారులు ప్రయాణించేటప్పుడు జారిపడుతూ గాయాల పాలవుతున్నారు. వాహనాలు వెళ్లేటప్పుడు కంకర్ లేచి రాళ్లు తగులుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి తాళ్లూరు-శివరాంపురం రోడ్డును హైవేరోడ్డు నిర్మాణ నిర్వాహకులతో బీటీరోడ్డుగా ఏర్పాటు చేయించి తమ ఇబ్బందులను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

పామూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటకట్టకిందపల్లి పంచాయతీ డీవీపల్లి గ్రామంలో ఆదివారం శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటుచేయడం శుభపరిణామమన్నారు. విగ్రహ ఏర్పాటుకు కృషిచేసిన నిర్వాహకులను అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సోమవారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ, బూత్ పరిధిలో సమస్యలు ఉంటే అర్జీల ద్వారా తెలపాలన్నారు. అర్జీతోపాటు ఆధార్‌కార్డు, జెరాక్స్ కాపీని జత చేయాలని సూచించారు. అనంతరం ఉగ్రను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, గట్ల కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుంటిగంగ సన్నిధిలోని గుంటిగంగమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి చల్లగా చూడమని వేడుకున్నారు. తాళ్లూరుతో పాటు వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో సందడి నెలకొంది. గంగమ్మ తల్లిని అధికసంఖ్యలో భక్తులు దర్శనం చేసుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వాహనదారులు వాహన పూజలు చేయించారు. మరికొందరు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకపూజారి ఎన్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, ఆర్‌వీ ప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు..

ముండ్లమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులో పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ పిల్లా పాపలను చల్లంగా చూడంటూ వేడుకున్నారు. పోలేరమ్మను ప్రత్యేక అలంకరణ చేశారు. ముండ్లమూరుతో పాటు నూజెండ్లపల్లి, బొప్పూడి వారిపాలెం, పసుపుగల్లు, మారెళ్ళ, పోలవరం గ్రామాల్లో పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులకు అన్నదానం ప్రారంభం

తాళ్లూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గుంటిగంగా భవానీ అమ్మవారి సన్నిధిలో నూతనంగా నిర్మించిన అన్నదాన భవనంలో దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం అన్నదానాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి అన్నదాన సత్రాన్ని నిర్మించిన మాజీ చైర్మన్ ట్రస్ట్ పేరుగా మార్చటంపై వివాదంగా మారిన విషయం విధితమే. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల జోక్యంతో ట్రస్ట్ చైర్మన్‌గా ఉన్న గురుబ్రహ్మం భవనం తాళాలతో పాటు ఆభవనాన్ని దేవస్థానానికి అప్పగిస్తూ అంగీకార పత్రాలను అధికారులకు అందజేశారు. దీంతో దేవదాయశాఖ ఈవో వాసుబాబు ఆభవనం పేరును శ్రీగుంటిగంగాభవాని అమ్మవారి దేవస్థాన అన్నదాన భవనంగా మార్పుచేస్తూ ప్రతి ఆదివారం గంగమ్మను దర్శించుకునే భక్తులకు అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



తాళ్లూరు: ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

మొదటిసారిగా ఆదివారం వంద మంది భక్తులకు దేవస్థాన అన్నదాన భవనంలో అన్నదానం చేశారు. గంగమ్మను దర్శించుకునే భక్తులకు ప్రతి ఆదివారం అన్నదానం చేయటం జరుగుతుందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో పూజారి ఎన్‌ప్రకాశ్‌పంతులు తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరులో పోలేరమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తాళ్లూరు: భక్తులకు అన్నదానం చేస్తున్న ఈవో వాసుబాబు, ఆర్‌వీ ప్రసాద్

మాక్ అసెంబ్లీకి ఎంపికైన నాగంబొట్లపాలెం విద్యార్థి

తాళ్లూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురష్కరించుకుని నవంబరు 26న జరిగే మాక్ అసెంబ్లీకి దర్శి నియోజకవర్గ స్థాయిలో నాగంబొట్లపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థి షేక్ మహమ్మద్ ఫరూక్ ఎంపికయినట్లు హెచ్‌ఎం అంజలి తెలిపారు. రాజ్యాంగదినోత్సవాన్ని పురష్కరించుకుని రాజధాని అమరావతి విధానసభలో ప్రజాసమస్యలపై ప్రజాగళాన్ని వినిపించడానికి నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులను ఎంపిక చేశారు. నాగంబొట్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న షేక్ మహమ్మద్ ఫరూక్ ఎంపికయ్యారు. సదరు విద్యార్థిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించి ఆదివారం రాజధాని అమరావతికి పంపారు.



మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం అంజలి

విద్యార్థుల విహారయాత్ర

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సహకారంతో ఏర్పాట్లు

కనిగిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో విద్యాభివృద్ధికి బాటలు వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి విద్యార్థులకు విహారయాత్ర ఏర్పాటుచేశారు. విద్యార్థుల సంతోషం కోసం విహారయాత్ర ఏర్పాటుకు తన సొంత నిధులను వెచ్చించి ఏర్పాట్లుచేశారు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం విహారయాత్రకు ఏర్పాట్లు చేయించారు. గతంలో మోడల్‌స్కూల్‌కు వెళ్లాలంటే రోడ్డు మార్గం సక్రమంగా లేదు. దీంతో విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని తారు రోడ్డును వేయించారు. అలాగే, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించటంతో పాటు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు.

ఈక్రమంలో తన సొంత నిధులతో పది బస్సుల్లో ఉచిత విహారయాత్రకు ఎమ్మెల్యే సహకరించటం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తంచేశారు.



బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల పాఠశాల హెచ్‌ఎం కలవ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తాళ్లూరు: సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, జడ్పీటీసీ, తహసీల్దార్

ఘనంగా సత్యసాయిబాబా జయంతి

పామూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయిబాబా 100వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు మాట్లాడుతూ విశ్వశాంతి, సౌభాగ్యం, సకల జనుల సంతోషం కోసం పరితపించిన బాబాను స్ఫూర్తిగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, షేక్ నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: సమాజసేవ, ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం సాగించేలా ప్రజలపై పుట్టపర్తి సత్యసాయిబాబా ఎంతో ప్రభావితం చేశారని ఎంపీడీవో పి.అనిత, తహసీల్దార్ బీవీ రమణారావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి అన్నారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆదివారం జరిగాయి.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమాజసేవ కోసం సత్యసాయి బాబా ట్రస్ట్ ద్వారా అనంతపురం జిల్లా వాసులకు మంచినీరు అందించారన్నారు. సత్యసాయిబాబా తన జీవితాంతం అన్ని వర్గాల ప్రజలకు, సమాజానికి ఎనలేని సేవ చేశారన్నారు. ముందుగా సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై భాస్కరరావు, ఉపాధ్యాయుడు కైపు పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

పీసీపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేయనున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పీసీపల్లిలో జరిగిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు స్టీఫెన్ మాట్లాడుతూ సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు, వేతనాల పెంపు, పనిగంటల తగ్గింపు వంటి కీలక హక్కులను స్వాతంత్రోద్యమకాలంలోనే కార్మికులు పోరాడి సాధించుకున్నారన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ హక్కులను రద్దు చేస్తూ లేబర్ కోడ్‌లను అమలుచేయాలని ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వీరపనేని చెన్నయ్య, మీనిగ మధుసూదన్‌రావు, పిచ్చయ్య, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు



మహానైవేద్యం తెస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థాన గాలి గోపురం వద్ద నుంచి స్వామివారికి మహానైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయ ప్రదర్శన చేసుకుంటూ స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గోశాలలోని గోమాతకు పసుపు కుంకుమతో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమాల్లో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో నరసింహబాబు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే ఉగ్ర సహకారంతో కనిగిరి నుంచి విద్యార్థులు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సుల్లో భైరవకోన క్షేత్రాన్ని ఆదివారం సందర్శించారు. జలపాతం వద్ద విద్యార్థులు సందడి చేశారు.

తూర్పుగంగవరంలో సాధువు మృతి

తాళ్లూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తూర్పుగంగవరంలో ఆదివారం అనాధ సాధువు మృతి చెందాడు. గుంటిగంగమ్మ సన్నిధిలో తలదాల్చుకుంటున్న ఓసాధువు సాయంత్రంవేళ తూర్పుగంగవరం వచ్చాడు. గ్రామంలోని వాసవీ స్టూడియో బయట కొంతసేపు సేద తీర్చుకుని నిద్రించాడు. ఎంతకూ లేవకపోవడంతో గమనించిన స్థానికులు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. గుంటిగంగ వద్ద ఉన్న సాధువుల వద్దకు వెళ్లి మృతుడి గురించి విచారించారు. పలువురు సాధువులు మృతదేహాన్ని చూసి అతను కడపజిల్లా వల్లూరు మండలం తప్పెట్లగ్రామానికి చెందిన కుంచెం పుల్లారెడ్డి అనే సాధువని గుర్తించారు. ఈమేరకు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు.

దేశాభివృద్ధిలో మాతృమూర్తుల పాత్ర కీలకం

ఒంగోలు కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధిలో మాతృమూర్తుల పాత్ర ఎంతో కీలకమైనదని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మాతృశక్తి సంయోజక గౌరీ సొదీకార్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని పెద్ద రామానుజకూటంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లిఖార్జునరావు అధ్యక్షతన జరిగిన దక్షిణాంధ్ర ప్రాంత మాతృశక్తి సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరీ సొదీకార్ మాట్లాడుతూ నాడు జిజియాబాయి చిన్నతనం నుంచే ఛత్రపతి శివాజీకి దేశభక్తిని బోధించి వీరుడిగా తీర్చిదిద్దిందన్నారు. ప్రతి మహిళ తమ బిడ్డలకు దేశభక్తి గురించి, దేశ నాయకుల గురించి అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ప్రార్థన, యోగ మొదలైన కార్యక్రమాలు జరిగాయి.

సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రాంత కార్యదర్శి పర్రే కోటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, సోమ సుబ్బారావు, ప్రణేష్, మురళమ్మ, ఈమని బలరాం, శ్రీనివాసగుప్తా, గడ్డం శ్రీనివాసరావు, పెరుమాళ్ రవి, సీతారామయ్య, అరవింద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకు మహిళలపై పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఈ నెల 25న అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవం నుంచి డిసెంబరు 10న మానవ హక్కుల దినోత్సవం వరకు జరిగే ప్రచార ఉద్యమాన్ని జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షురాలు ఎస్‌డీ.షర్మిల అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న ఘోరాలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించటం, సమగ్ర విచారణ, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుపై ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపటం లేదన్నారు.

కార్యక్రమంలో నాయకులు జి.ఆదిలక్ష్మి, ఎస్‌కే.నాగూర్, కె.ప్రసన్న, కె.రాజేశ్వరి, బి.పద్మ, కె.ధనలక్ష్మి, పి.రత్నం, ఎస్.డి.ఖాదరున్నీసా, పి.రత్తమ్మ, ఎస్‌కే.మస్తాన్‌బి, పి.ప్రేమలత, రమీజ, ఎస్‌డీ.అమీరున్నీసా, ప్రమీల, కె.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.





అన్నదాతకు.. అండగా

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని.. చెమట చిందించి.. రెక్కల కష్టంతో సాగు చేసి.. అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు అండగా ప్రభుత్వం కదిలేందుకు సిద్ధమైంది. ఏడాదిన్నర పాలనలో ప్రభుత్వం ఏమి చేసింది.. రైతులకు వివిధ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూర్చింది.. రాబోయే రోజుల్లో వారి సంక్షేమానికి ఏ విధంగా కట్టుబడి ఉందో వివరిస్తూ రైతన్నా.. మీ కోసం కార్యక్రమం పేరిట సోమవారం నుంచి యంత్రాంగం రైతుల ఇంటి బాట పట్టనున్నది. అన్నదాతల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోన్న ప్రభుత్వం.. వారి సాదకబాధకాలు తెలుసుకోవడంతో పాటు పథకాలు అందడంలో ఏమైనా జాప్యం జరుగుతోందా, ఇంకా ప్రభుత్వం వైపు నుంచి ఏం చేయాల్సి ఉంది.. అనే అంశాలపై స్వయంగా వారితోనే చర్చించనున్నారు. రైతు సేవా కేంద్రాలు యూనిట్‌గా సోమవారం నుంచి ఈ నెల 29 అంటే శనివారం వరకు ఆరు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనున్నది. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. కార్యక్రమ షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. కార్యక్రమ అమలుకు వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యేలు.. ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి స్వయంగా కలవనున్నారు.

నేటి నుంచి రైతన్నా.. మీ కోసం

- ఆరు రోజులు నిర్వహణకు ప్రణాళికలు
- రైతుల ఇళ్లకు అధికారులు.. ప్రజాప్రతినిధులు
- ఒక్కో ఆర్‌ఎస్కే పరిధిలో రోజుకు 90 ఇళ్ల సందర్శన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అన్నదాతల సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలు అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసింది. సాగు పెట్టుబడి ఖర్చుల కోసం రెండు విడతల్లో రూ.14,000 రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిన విషయం తెలిసిందే. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేసేందుకు మరో వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. రైతన్నా.. మీకోసం పేరుతో సోమవారం నుంచి నేరుగా రైతులను వారి ఇళ్ల వద్ద కలిసేందుకు సిద్ధమైంది. పంటల సాగులో పంచసూత్రాల అమలుపై అన్నదాతలకు అవగాహన కల్పించడమే రైతన్నా.. మీకోసం కార్యక్రమ లక్ష్యంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సీఎం రాసిన లేఖతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించే కరపత్రాన్ని రైతులకు అధికారులు అందించనున్నారు. ఆరు రోజులు జరిగే ఈ కార్యక్రమంలో సాగు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై రైతుల కు అవగాహన కల్పించి వారి నుంచి అభిప్రాయాలను సేకరిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బృందాన్ని నియమించింది. రైతు సేవా కేంద్రం వ్యవసాయ అసిస్టెంట్ టీమ్ లీడర్‌గా ఉంటారు. వీఆర్‌వో, గ్రామ ఇంజనీరింగ్ సహాయకుడు, గ్రామశక్తి సహాయకుడు, ప్రగతిశీల రైతులు, పీఏసీఎస్, డబ్ల్యూయూఏ, ఎంఎంసీ సభ్యులు ఈ బృందంలో సభ్యులుగా ఉంటారు. రోజుకు 90 రైతు కుటుంబాలను ఆయా బృందాలు కలిసేలా ప్రణాళిక రూపొందించారు.అంటే ఆరు రోజులకు ఒక్కో రైతు సేవా కేంద్రం యూనిట్‌గా 540 రైతు కుటుంబాలను ఆయా బృందాలు

(మిగతా 8లో)



నేతన్నల్లో నిరాశ

చేనేత కార్మికులందరి కుటుంబాలకు ప్రతి నెలా 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ ఇస్తున్నాను. అది ఈ ఆగస్టు 7 నుంచే అమల్లోకి వస్తుంది.

అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఏడాది ఆగస్టు 7న మంగళగిరిలో నిర్వహించిన చేనేత దినోత్సవంలో నేతన్నలకు హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి మూడున్నర నెలలు కావస్తున్నా నేతన్నలకు విద్యుత్ ఊరట మాత్రం లభించలేదు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన తొలినాళ్లలో కాస్త హడావుడి చేసిన అధికారులు ఆ తరువాత ఆ ఊసే ఎత్తడం మానేశారు. పథకం గురించి సచివాలయాల చుట్టూ తిరుగుతున్న కార్మికులకు వారు చెప్పే సమాధానాలతో వారంతా నిరాశ చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పథకం అమలు విషయంలో నేతన్నలో అనుమానం, ఆందోళన కనిపిస్తోంది.

- మూడున్నర నెలలుగా ఊసే లేని ఉచిత విద్యుత్
- అమలు కాని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన
- తొలుత హడావుడి.. ఆ తర్వాత ఊసే మరిచిన అధికారులు
- పథకం అమలుపై చేనేతల్లో అనుమానం, ఆందోళన

10 వేలమంది గుర్తింపు

- గుంటూరు జిల్లాలో ఇప్పటికే 2,460 మందిని అర్హులుగా గుర్తించి జాబితాను సిద్ధం చేశారు.
- పల్నాడు జిల్లాలో 280 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు.
- బాపట్ల జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 7 వేల పై చిలుకు ఉంది. ఇదంతా సొంత ఇల్లు,మగ్గం కలిగినవారి జాబితా మాత్రమే.

(చీరాల - ఆంధ్రజ్యోతి)

నేతన్నకు ఉచిత విద్యుత్ పథకం లబ్ధిదారుల జాబితాను సచివాలయ ఉద్యోగులు రెండు నెలల క్రితమే పూర్తి చేశారు. చేనేత, జౌళి శాఖ జిల్లా కార్యాలయ పర్యవేక్షణలో చేనేత గుర్తింపు కార్డు కలిగి ఉండడం, ఇళ్లలో చేనేత మగ్గం ఉండడం ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తెనాలి, బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం సహా చుట్టుపక్కల ఉన్న చేనేత గ్రామాలు, చెరుకుపల్లి, పేటేరు, ఇసుకపల్లి, వరపర్ల పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, సత్తెనపల్లి గ్రామాల్లో పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇలా మూడు జిల్లాల పరిధిలో సుమారు 10 వేల మంది వరకు చేనేత కార్మికులు ఉచిత విద్యుత్‌కు అర్హత ఉన్నట్లు అధికారులు గుర్తించి జాబితాను సిద్ధం చేశారు. కాగా మంగళగిరి, పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మంది షెడ్డులో నేసే కార్మికులు ఉన్నారు. వారిని కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చాలన్న డిమాండు వినిపిస్తోంది. దీనిపై మంత్రి లోకేశ్ కూడా (మిగతా 8లో)



రైతుల ఇళ్లల్లో నిల్వ ఉన్న పత్తి

పెట్టుబడి రూ.65 వేలు.. దిగుబడి రూ.25 వేలు

కన్నీటి పర్యంతమవుతున్న పత్తి రైతులు

మార్టూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా సగానికి సగం దిగుబడి తగ్గిపోయింది. అరకొర వచ్చిన పత్తిని అమ్ముకునేందుకూ అవస్థలు పడాల్సి వస్తోంది. ఇదీ నియోజకవర్గ పరిధిలోని పత్తి రైతుల దీనస్థితి. కౌలు సహా సాగు ఖర్చులు రూ.65 వేలు అవుతుండగా దిగుబడి రూ.25 వేలు మాత్రమేనని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పెట్టిన పెట్టుబడుల్లో సగం కూడా రాని పరిస్థితి నెలకొంది. అరకొర వచ్చిన పంటను అమ్ముకునేందుకు సిద్ధమైతే పల్నాడు జిల్లాలోని గణపవరానికి వెళ్లాల్సి వస్తుందని, వ్యయప్రాసలకు ఓర్చి అక్కడకు వెళ్తే తేమ నిబంధన పేరుతో కొర్రీలు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మార్టూరు, రాజుపాలెం, నాగరాజుపల్లి గ్రా మాలలో సుమారు 630 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎకరాకు రూ.50 వేలకు పైగానే పెట్టుబడి అవుతుండగా కౌలు రూ.15 వేలు అదనం. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆశించగా తుఫాన్ వారిని ముంచేసింది. దీంతో ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల మాత్ర మే దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో దళారులు క్వింటా పత్తిని 5 వేలు నుంచి 6 వేలకు మధ్యలోనే కొనుగోలు చేస్తుండటంతో రైతులు డీలాలు పడిపోయారు. ఈ క్రమంలో మళ్లీ తుఫాన్ హెచ్చరికలతో రైతులు భయంతో అల్లాడుతున్నారు. దీంతో కొందరు రైతులు కూలీలకు అధికంగా సొమ్ములు చెల్లించి పత్తిని ఇంటికి చేరుస్తున్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



సొంతంగా 4, కౌలుకు 8 ఎకరాలు తీసుకుని 12 ఎకరాలు పత్తి సాగు చేశాను. రూ.6 లక్షలు దాకా పెట్టుబడి పెట్టాను. కనీసం 90 నుండి 100 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అనుకున్నాను. కాని 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ పత్తిని అమ్ముకోవ డానికి పక్క జిల్లాకు వెళ్లాల్సి వస్తుంది. ఇందుకు రవాణా ఖర్చు అదనం. నాలాంటి రైతులు మా గ్రామంలో చాలామంది ఉన్నారు. అందువలన సీసీఐ మార్టూరులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

- శాఖమూరి శేషయ్య రాజుపాలెం

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- యోగా పోటీల ప్రారంభోత్సవంలో డీఈవో పురుషోత్తం
- చందలూరులో అలరించిన కోలాట ప్రదర్శన, యోగాసనాలు

పంగులూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో గుర్తింపు ఇస్తూ ప్రోత్సహిస్తున్నాయని ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచి చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని డీఈవో పురుషోత్తం తెలిపారు. ఎస్.జి.ఎఫ్. 69వ రాష్ట్రస్థాయి యోగా పోటీలను ఆదివారం మండలంలోని చందలూరు గ్రామంలో ప్రారంభించారు. పోటీల నిర్వాహక కమిటీ చైర్మన్ చందలూరి గిరిజ అధ్యక్షతన జరిగిన సభలో డీఈవో మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడే యోగా ప్రక్రియ ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. చదువు ద్వారా జ్ఞానం, క్రీడల ద్వారా మానసిక వికాసం లభిస్తాయన్నారు. ఆలిండియా బ్యాడ్మింటన్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి కరణం పున్నయ్యచౌదరి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల నిర్వహణకు గ్రామస్థుల ప్రోత్సాహం అభినందనీయన్నారు.

అట్టహాసంగా పోటీలు

రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో క్రీడాకారులు చందలూరుకు తరలివచ్చారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. 13 ఉమ్మడి జిల్లాల నుంచి అండర్ 14, 17, 19 స్థాయిల్లో యోగాసన ప్రదర్శనలకు విద్యార్థినీ, విద్యార్థులు 470 మంది తరలిరాగా అట్టహాసంగా పోటీలను ప్రారంభించారు. జ్యోతిప్రజ్వలన అనంతరం జిల్లాల వారీగా క్రీడా పతాకాలతో క్రీడాకారుల మార్చ్‌పాస్ట్ క్రీడాస్ఫూర్తినింపింది. విద్యార్థినుల నృత్యప్రదర్శన అలరించాయి. ఈ కార్యక్రమంలో డీవైఈవో గంగాధర్, ఎస్.జి.ఎఫ్. జిల్లా కార్యదర్శులు కొండా ప్రతిమ, వెంకటేశ్వర్లు, పోటీల పరిశీలకులు పూర్ణచందరరావు, సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, ఎం.ఇ.ఓ. నాగభూషణం, మాజీ జడ్.పి.టి.సి. కె.వి.సుబ్బారావు, పెంట్యాల రామలింగస్వామి, అడ్డగడ సుబ్బయ్య, అజిత్‌ట్రస్ట్ ఛైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, పీడీ మధుమూర్తి, ముద్దన విష్ణు, ప్రధానోపాధ్యాయులు పెంట్యాల గంగాధర్, ఐ.అనిత, గోవిందరాజులు, రావి శ్రీనివాసరావు, వాసుబాబు, అద్దంకి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి యోగా పోటీల ప్రారంభసభలో మాట్లాడుతున్న డీఈవో పురుషోత్తం



యోగాసనంతో స్వాగతం పలికిన పాఠశాల క్రీడాకారులు

వేటపాలెంలో జాతీయ జీడిపప్పు దినోత్సవం



సత్యానందంను సత్కరిస్తున్న జీడిపప్పు వ్యాపారులు

వేటపాలెం(చీరాల), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ జీడిపప్పు దినోత్సవం వేటపాలెంలో ఆదివారం ఘనంగా జరిగింది. అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రసంగించారు. జీడిపప్పు పరిశ్రమలో కార్మికులది ప్రత్యేకపాత్రని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పప్పుకు వన్నెతెచ్చి కొనుగోలుదారులకు తృప్తికరమైన పప్పు అందిస్తా రని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు పప్పును ఎగుమతి చేసి వేటపాలెం ఘనతను చాటుతున్నట్లు తెలిపారు. ప్రతికూల పరిస్థితులలో వ్యాపారులకు ప్రత్యేక రాయితీలు కల్పించాలని కోరారు. జీడిపప్పుమాల, పుష్పగుచ్ఛాలు, బొకేలను వినూత్నంగా తయారు చేస్తున్న సత్యాల సత్యానందంను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసి యేషన్ ప్రతినిధులు ప్రత్తి వెంకటసుబ్బారావు, శరత్‌బాబు, నాగాంజనేయులు, ఉమామహేశ్వరరావు, రంగనాథ్, లక్ష్మణస్వామి, సుబ్రహ్మణ్యం, గుల్జారా, మున్నీ, రిజ్వానా, రఫియా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన.. హ్యాపీ సండే



కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు



చిన్నారుల నృత్య ప్రదర్శన

- ప్రజలందరూ భాగస్వాములు కావాలన్న కలెక్టర్

బాపట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు.. అలరించిన వివిధ కళారూపాల ప్రదర్శనలతో బాపట్ల రథంబజారు ఆదివారం సాయంత్రం సందడిగా మారింది. స్థానిక శ్రీ భావన్నారాయణస్వామి దేవాలయం ఎదుట హ్యాపీ సండే పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని వీక్షించేందుకు పట్టణ ప్రజలు, విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ హ్యాపీ సండే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో నిర్వహిస్తున్న హ్యాపీసండే ప్రతి ఆదివారం సాయంత్రం నిర్వహిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారంతా మున్సిపల్ కమిషనర్ దగ్గర పేర్లు నమోదు చేయించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించాలని సూచించారు. జిల్లాలో వివిధప్రాంతాలలో ఉన్న వివిధ రకాల కళారూపాలను ప్రదర్శించడానికి హ్యాపీ సండే మంచి వేదికగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ మందపాటి ఆంధ్రేయ, బూర్లె రామసుబ్బారావు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణ భట్టు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి



శ్రీసత్యసాయిబాబా పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్, పోలీసు అధికారులు

బాపట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీసత్యసాయిబాబా బోధనలు ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను నిర్వహించారు. పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అనే సాయిబాబా బోధనలు ఆచరణీయమన్నారు. అనేక విద్య, వైద్య సంస్థలు స్థాపించి పేదలకు ఉచిత సేవలందించటమే కాకుండా గ్రామాలకు తాగునీటి ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

చేపకేసిన గాలం.. కంటి రెప్పకు గుచ్చుకుంది



కంటిపై గుచ్చుకున్న గాలం

బాపట్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుప్రోలువారిపాలెం గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి నక్కల సందీప్ ఆదివారం సెలవుదినం కావడంతో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే సమయంలో గాలం లాగటంతో ముల్లు వచ్చి కంటి రెప్పపై భాగాన లోతుగా దిగబడింది. స్నేహితులు గమనించి ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ ఆపరేషన్ చేసి గాలం ముల్లు తొలిగించారు. కంటికి ఎటువంటి సమస్య లేదని డాక్టర్ తెలిపారు. పిల్లలు ఆడుకునే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు.

అవీ..ఇవీ..

గుండెపోటుతో వ్యక్తి మృతి

● మార్టూరు కూరగాయల మార్కెట్ వద్ద ఘటన

మార్టూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన ఘటన మార్టూరు సెంటర్లో పెద్ద అండరుపాస్ సమీపంలోని దుకాణం వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకొంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ మండలంలోని తాతపూడి గ్రామానికి చెందిన సోమేపల్లి శ్రీనివాసరావు (60) చికెన్ కూరగాయల కోసం స్కూటీపై మార్టూరు వచ్చా డు. కూరగాయాలు, నిత్యావసరాలు తీసుకున్న తర్వాత తిరిగి స్కూటీపై ఇంటికి వెళ్లే సమయంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో అక్కడి వారు ఈ విషయాన్ని 108 వాహనానికి సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన సిబ్బంది అప్పటికే శ్రీనివాసరావు మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే శ్రీనివాసరావు వద్ద సెల్‌ఫోన్ గాని, ఇత రత్రా ఆధారాలు గాని లభించలేదు. దీంతో దాదాపుగా 2 గంటల పాటు పోలీసులు మృతుని ఆచూకి కోసం ప్రయత్నించారు. శ్రీనివాసరావు సోద రుడు మరి కొంతమంది బంధువులు మార్టూరు వచ్చి మృతుడిని గుర్తించి ఇంటికి తీసుకువెళ్లారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నూతనంగా నిర్మించిన టవర్ మీదకు కొత్తలైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి మార్కెట్ యార్డు వరకు ఒంగోలు రోడ్డుకు పడమర వైపు సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచివేస్తున్నట్లు డీఈఈ ఎం.దామోదర్ ఆదివారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహృదయంతో సహకరించాలని ఆయన కోరారు.

దుద్దుకూరులో నేత్రదానం

ఇంకొల్లు, నవంబరు 23,(ఆంధ్రజ్యోతి) : రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో 717వ నేత్రదానం జరిగింది. దుద్దుకూరు గ్రామానికి చెందిన కటారి శ్రీలక్ష్మమ్మ(90) మృతి చెందగా కుటుంబసభ్యుల సహకారంతో శంకరకంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబసభ్యులు తిరుమలరావు, భాస్కరరావులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, రోటరీ క్లబ్ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, గోరంట్ల నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు అభినందించారు.

అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో కారు బోల్తా

సంత వ నా గు ల వా రు నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో కారు బోల్తాపడిన ఘటన మండలంలోని కొమ్మాలపాడు సమీపంలో ఆదివారం చోటుచేసుకొంది. అద్దంకి- నార్కెట్‌పల్లి రహదారి అండర్‌పాస్ కింద



నీట మునిగిన కారు

ప్రవహిస్తున్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో ఈ ఘటన జరిగింది. వినుకొండ నుంచి అద్దంకి వైపు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ తప్పించబోయి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. కాలువలో నీటి ప్రవాహం ఉండడంతో కారు కొట్టుకుపోతోంది. అయితే డ్రైవర్‌కు ఈత రాకపోవడంతో సాయం కోసం కేకలు వేశాడు. పక్కనే స్నానం చేస్తున్న అయ్యప్ప దీక్షదారులు వేగంగా స్పందించి కారు నుంచి డ్రైవర్‌ను బయటకు తీసుకొచ్చారు. అయితే కారులో ఇతర ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

అటవీ ప్రాంతాల్లో కోడిపందేల నిర్వహణ

● డ్రోన్‌సాయంతో గుర్తించి పట్టుకున్న పోలీసులు

పిట్టువారిపాలెం(చీరాల), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పిట్టువారిపాలెం అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఆదివారం ఈపూరుపాలెం, వేటపాలెం ఎస్సైలు చంద్రశేఖర్, జనార్ధన్ మెరుపు దాడులు నిర్వహించారు. డ్రోన్ కెమెరా సాయంతో శిబిరాన్ని గుర్తించిన పోలీసులు ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశారు. అలాగే నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక కోడి, రూ.5100 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారి వెంట ట్రైనీ ఎస్సై అలేఖ్య, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

చినగంజాం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవణా చేస్తున్న టిప్పర్‌ను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు. పందిళ్లపల్లి నుంచి ఒంగోలుకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను చినగంజాం గ్రామ సమీపంలోని 216వ జాతీయ రహదారి టీ.జంక్షన్ వద్ద పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవణా చేస్తున్న టిప్పర్ యజమాని ప్రదీప్‌కుమార్, వాహన డ్రైవర్లు నామతోటి మహేంద్ర, కురాకుల వెంకటరమణలను అదుపులోనికి తీసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు.

కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

● చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్

కారంచేడు(పర్చూరు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేసులను త్వరితగతిన పరిష్కరించాలని చీరాల డీఎస్పీ ఎండి. మొయిన్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం కారంచేడు స్టేషన్‌ను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. చోరీలు చోటు



రికార్డులను పరిశీలిస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్

చేసుకోకుండా రాత్రి సమయాల్లో తప్పక పోలీసు గస్తీ నిర్వహించాలన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కల్గకుండా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కారంచేడు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ వాహనాలకు హెల్మెట్‌లు ఉండటం గమనించిన ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ వైవీ.రమణయ్య, ఎస్సై షేక్.ఖాదర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

చినగంజాం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చినగంజాం ఎస్.ఐ శీలం రమేష్ హెచ్చరించారు. మండలంలోని కదవకుదురు గ్రామంలో శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్'లపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు చిట్టిబాబు మృతి

ఇంకొల్లు, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కరి చిట్టిబాబు(55) శుక్రవారం మృతి చెందాడు. చిట్టిబాబు దీర్ఘకాలంగా టిడిపి పార్టీలో చురుకుగా పని చేసారు.గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న చిట్టిబాబు శుక్రవారం మృతి చెందగా మండలంలోని టిడిపి నాయకులు,పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తపరిచారు.

నేడు నాగులపాడులో మంత్రి పర్యటన

అద్దంకిటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో నాగులపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనం ప్రారంభోత్సవం సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేయనున్నారు.

ఘనంగా సత్యసాయి శతజయంతి

పర్చూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీ సత్యసాయిబాబాను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బాబా జయంతిని నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. ఆదివారం పర్చూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన సత్యసాయిబాబా శతజయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మానవసేవే మాధవసేవ అనే నినాదంతో సేవా కార్యక్రమాలు చేపట్టి బాబా విశ్వవ్యాప్తం అయ్యారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి వెంకటకృష్ణరావు(కృష్ణ) మాట్లాడుతూ విద్యా, వైద్య, ఆధ్యాత్మిక తదితర రంగాల్లో వారు చేపట్టిన సేవలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్ర ముస్లీం కార్పొరేషన్ ఛైర్మన్ షేక్.షంషుద్దీన్ మాట్లాడుతూ అనంతరపురం జిల్లాకు తాగునీరు అందించిన ఘనత సత్యసాయి బాబాకే దక్కుతుందన్నారు. విద్యా, వైద్యరంగాల్లో ఆయన చేసిన సేవ చిరస్మరణీయం అని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శకుంతల, ఈవోఆర్‌డీ హరిప్రసాద్, ఆర్యవైశ్య సంఘ నాయకులు మామిడిపాక హరిప్రసాద్, కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షులు కనమర్లపూడి కృష్ణమోహన్, సత్యసాయి బాబా ట్రస్ట్ ప్రతినిధి హనుమంతురావు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : సత్య సాయిబాబా శతజయంతిని ఆదివారం గాంధీబొమ్మ కూడలిలోని సత్య సాయిబాబా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం సత్యసాయిబాబా చిత్రపటంతో భక్తులు, మహిళలు పాల్గొని నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం మందిరంలో పల్లకి సేవ, భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరూధిని, ఎంఈవో కెవి శ్రీనివాసరావు, సత్యసాయిబాబా మందిరం కన్వీనర్ చిన్ని శ్రీహరిరావుతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమంలు నిర్వహించారు.

వేటపాలెం(చీరాల) : ప్రతి మానవుడు ఆధ్యాత్మిక



సత్యసాయిబాబా చిత్రపటం వద్ద ఎస్‌డీసీ లవన్న

చింతనతో ముందు సాగాలని తద్వారా, ఆనందరం, ఆరోగ్యం సాధ్యమని వేటపాలెం ఎంపీడీవో రాజేష్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో సత్యసాయి బాబా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంక టేశ్వర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : స్థానిక సత్యసాయి మందిరంలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఆదివారం సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. మందిరంలో సత్య సాయిబాబా చిత్రపటానికి పూల మాలలు వేసి, ప్రత్యేక పూజలు అనంతరం సాయిబాబా సహస్ర నామ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి సభ్యులు వంద మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పూజల అనంతరం నారాయణ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి మండల కన్వీనర్ మాజేటి శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక కన్వీనర్ రామసుబ్బారావు, ఆధ్యాత్మిక మహిళ కన్వీనర్ వేదాల లక్ష్మి, సమితి సభ్యులు మాజేటి లక్ష్మీప్రసన్న, బొమ్మిశెట్టి బాల కోటేశ్వరగుప్త, తుమ్మల పెంట మునలయ్య పాల్గొన్నారు.







అద్దంకిలో స్వామివారి సంకీర్తన చేస్తున్న భక్తులు, చినగంజాంలో చీరల పంపిణీ, వేటపాలెం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో

లోడు లారీ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

● 20 మీటర్లు బంపర్‌తో ఈడ్చుకెళ్లిన లారీ
● నెల క్రితం అదే ప్రాంతంలో ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
● రెండు ఘటనల బాధితులు రక్త సంబంధీకులు

తోటవారిపాలెం(చీరాల), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లోడు లారీ ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని 216 జాతీయ రహదారి అంబేడ్కర్‌నగర్ జంక్షన్ వద్ద చోటుచేసుకొంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, చీరాల మండలం తోటవారిపాలెం అంబేడ్కర్ నగర్‌కు చెందిన వృద్ధుడు నక్క మేషక్ రోజువారీ కూలీ. ఈక్రమంలో ఆదివారం రాత్రి సమయంలో ఈపూరుపాలెం పనికి వెళ్లి కాలినడకన ఇంటికి వస్తూ రోడ్డు తాడుతున్నాడు. ఈ క్రమంలో భీమవరం నుంచి చెన్నై వైపు వెళుతున్న రొయ్యల లోడు లారీ వృద్ధుడిని ఢీకొంది. అనంతరం సుమారు 20 మీటర్లు బంపర్‌తో వృద్ధుడిని ఈడ్చుకెళ్లింది. అనంతరం అకస్మాత్తుగా డ్రైవర్ బ్రేకులు వేయడంతో కింద పడడంతో బాధితుడి తలకు శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన మేషక్

గతంలోనూ ఇక్కడే ప్రమాదం

ఇదిలా ఉంటే సరిగ్గా నెల క్రితం ఇదే ప్రాంతంలో ఓ కారు వేగంగా ప్రస్తుత క్షతగాత్రుడి రక్తసంబంధీకుడు నక్క రత్నబాబు(35)ను ఢీ కొంది. ఆయన గుంటూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరొక వ్యక్తి తీవ్ర గాయాలతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు భీతిల్లుతున్నారు. ప్రమాదాల నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అన్నదాతకు.. అండగా

(5వ పేజీ తరువాయి)

కలవనున్నాయి. రోజుకు 90 ఇళ్ల చొప్పున బాపట్ల జిల్లాలో 326 ఆర్ఎస్‌కేల పరిధిలో 29,340 రైతు కుటుంబాల ఇంటికి సిబ్బంది వెళ్లనున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలను కూడా కలుపుకుంటే రోజుకు దాదాపుగా లక్ష మంది అన్నదాతల కుటుంబాల ఇంటి గడప ప్రభుత్వ యంత్రాంగం తొక్కనుంది. ఆయా నియోజకవర్గాల పరిధిలో ఉన్న ప్రజా ప్రతినిధులు కూడా రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారు.

పంచసూత్రాలపై అవగాహన

నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే పంచసూత్రాల విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని సంకల్పించింది. వీటిపై రైతులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా రైతన్నా మీకోసం బృందం అవగాహన కల్పించనున్నది. పాడి రైతులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకందారులు, ఆక్వా ఉద్యాన, సెరికల్చర్ రైతులకు కూడా అవగాహన కల్పించనున్నా రు. వ్యవసాయ యాంత్రీ కరణ, నేల పరీక్ష, సూక్ష్మ నీటి పారుదలలో ఆటోమేషన్, తెగుళ్ల పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక, లాట్ ఆధారిత వ్యాధి అంచనా, డ్రోన్ వినియోగం, మామిడి, జామలో పండ్ల సంరక్షణ, అరటిలో గుత్తుల స్లీవ్‌లు, కోతకు ముందు.. కోత తర్వాత సాంకేతికత, మౌలిక సందుపాయాలు కోల్డ్‌స్టోరేజ్, ప్యాక్ హౌస్‌లు, రవాణా సౌకర్యాలను రైతులకు వివరించు న్నారు. అదేవిధంగా రైతులు ఏ పంట సాగు చేశారు.. వారికి ఎలాంటి సాయం అవసరమనే విషయాల్ని కూడా నేరుగా తెలుసుకోనున్నారు. సాగులో పురుగు మందుల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించనున్నారు. సమర్థ నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు వంటి విషయాలను రైతులు తెలియజేయనున్నారు. ప్రకృతి సేద్యంతో భూసార రక్షణతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందని ఈ దిశగా రైతులను చైతన్యపరచనున్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను అందిపుచ్చుకుని సాగును లాభసాటి చేసుకునేందునే పంచ సూత్రాలను ప్రభుత్వం అమలు చేయనుంది.

డిసెంబరు 3న వర్క్‌షాప్

రైతన్నా మీ కోసం కార్యక్రమం అనంతరం డిసెంబరు 3న ఆర్ఎస్‌కేల పరిధిలో వర్క్‌షాప్ నిర్వహించనుంది. రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలు, ప్రస్తుతం ఉన్న దిగుబడులు, ఏయే పంటల విస్తీర్ణం ఎక్కువగా జరిగింది అనే అంశాల ఆధారంగా ప్రస్తుత రబీ యాక్షన్‌ప్లాన్‌తో పాటు వచ్చే ఖరీఫ్, రబీపై రైతులను ఏ విధంగా సన్నద్ధ పరచాలనే ప్రణాళికలను ఈ వర్క్‌షాప్‌లో రూపొందించనున్నారు. వ్యవసాయశాఖ సిబ్బందితో అన్నదాతలను కూడా పూర్తి స్థాయిలో ఈ వర్క్‌షాప్‌లో భాగస్వామ్యం చేయనున్నారు. వినూత్న సేద్యంతో లాభాట బాటలో ఉన్న రైతుల విజయగాథలను కూడా వివరించి రైతులకు ప్రేరణ అందించనున్నారు.

నేతన్నల్లో నిరాశ

(5వ పేజీ తరువాయి)

సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ప్రభుత్వ ఆమోదం ఎప్పుడు?

మూడు జిల్లాలకు చెందిన 10 వేల మంది కార్మికులను గుర్తించి వారి జాబితాను ఆయా జిల్లాల చేనేత, జౌళి శాఖ అధికారులు రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపించారు. ఈ ప్రక్రియ పూర్తై దాదాపు మూడు నెలలు కావస్తోంది. కానీ కమిషనర్ కార్యాలయంలో ఫైలు మాత్రం ముందుకు కదలలేదు. అధికారుల నిర్లక్ష్యమా? ప్రభుత్వ సాచివేత ధోరణా? కారణమేదైనప్పటికీ నేతన్నలు విద్యుత్ భారాన్ని మోయాల్సి వస్తోంది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చేనేత కుటుంబాలు బాగా దెబ్బ తిన్నాయి. మూడు నెలలపాటు పనులు లేక అప్పుల పాలయ్యారు. ఈ విద్యుత్ ఊరట లభిస్తే వారికి కొంతలో కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.

పార్టీ ఆశయాలను అనుసరించి నడవండి

● టీడీపీ పట్టణ నూతన కమిటీతో ప్రమాణం స్వీకారం చేయించిన ఎమ్మెల్యే

చీరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆశయాలకు కట్టుబడి వాటిని అనుసరించి పనిచేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కిరాణా మర్చంట్స్ కల్యాణ మండపంలో నూతన



పట్టణ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే

పట్టణ కమిటీ ప్రతినిధులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. పట్టణ అధ్యక్షులుగా డి. వెంకటసురేష్ నియామకమయ్యారు. పార్టీ విధి విధానాలను అనుసరిస్తూ, ప్రజల్లో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కమిటీ ప్రతినిధులకు సూచించారు. అంతకుముందు సత్యసాయి బాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక స్థిరత్వం కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెండి తొడుగు, గద బహూకరణ





తొడుగును అందజేస్తున్న దాతలు, తొడుగు అలంకరణతో స్వామివారు

అద్దంకిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ వద్ద ఉండే స్వామి వారి ఉత్సవమూర్తి విగ్రహానికి దాతలు ఆదివారం వెండి తొడుగు, గదను బహుకరించారు. అద్దంకి చెందిన మోదగుడు రాంబాబు, భార్య ఇందిరా దేవి కుటుంబ సభ్యులు రూ.3.23 లక్షలతో 1.700 కిలోల వెండితో ఆలయంలోని ఉత్సవమూర్తి స్వామిజీకి తల నుండి కాళ్ల వరకు వచ్చేలా వెండి తొడుగు, గదను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు, ఆలయ మండలి అధ్యక్షుడు చుండూరి మురళీ సుధాకరావు చేతుల మీదగా స్వామివారికి బహూకరించారు. ఈ క్రమంలో ఉత్సవ మూర్తికి అర్చకులు వెండి తొడుగు, గదను అలంకరించారు. కార్యక్రమంలో సభ్యులు నూతి ప్రసాద్, పద్మజ, వెంకటరత్నం, ప్రధాన అర్చకులు కోటా లక్ష్మీనారాయణ దాత రాంబాబు, భార్య ఇందిరాదేవి, కుమారులు వెంకట శ్రీనివాసరావు, ఆంజనేయులు, కుమార్తె నాగాంజలి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

● భారీగా తరలివచ్చిన భక్తులు

పంగులూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైటమంజులూరు గ్రామంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠాచార్యులు దివి తిరుమల సత్యనారాయణప్రసాద్ ఆదివారం ఉదయం 9.34 గంటలకు స్వామివారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణతో కనులపండువగా నిర్వహించిన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని తిలకించేందుకు బైటమంజులూరు, పరిసర ప్రాంతాల నుండి తరలి వచ్చారు. వేలాదిమంది భక్తులు గ్రామకమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



గ్రామంలో ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం

రామాంజనేయులుకు మహానంది అవార్డు



మహానంది పురస్కారం అందుకుంటున్న రామాంజనేయులు

పంగులూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వడ్రంగి, శిల్ప కళారంగంలో విశిష్ట సేవలందించిన కల్లంవారిపాలెం గ్రామస్థుడు బ్రహ్మశ్రీ మచ్చా రామాంజనేయులుకు 'తెలుగు వెలుగు మహానంది' అవార్డు లభించింది. జాతీయ స్వచ్ఛంద సేవాసంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక వారు విజయవాడ ఠాగూర్ గ్రంథాలయం వేదికగా నిర్వహిస్తున్న శ్రీ మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలలో (2025-26) వడ్రంగి, శిల్ప కళారంగాలలో మచ్చా రామాంజనేయులు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపికచేశారు. ఈ పురస్కారాన్ని పోలోజ్ రాజ్‌కుమార్ ఆదివారం అందచేశారు. కార్యక్రమంలో పంతుల వెంకటేశ్వరరావు, శారదా స్రవంతి అధ్యక్షులు పోలవరపు కోటేశ్వరరావు, మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు, తక్కెళ్లపాటి నాగేంద్రప్రసాద్, నారాయణరావు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలలో కొప్పెరపాడుకు ప్రథమస్థానం

కొప్పెరపాడు(బల్లికురువ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చెకుముఖి సైన్స్ జిల్లా స్థాయి ప్రతిభ పరీక్షల్లో బల్లికురవ మండలం, కొప్పెరపాడు ఉన్నత పాఠశాల ప్రథమస్థానంలో నిలిచింది. ఆదివారం చీరాలలో మండల స్థాయిలో గెలుపొందిన 26 మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో బల్లికురవ మండలం కొప్పెరపాడుకు చెందిన 10వ తరగతి విద్యార్థి వై.మోహన మణికంఠ యాదవ్, 9వ తరగతి విద్యార్థి ఎస్.విల్సన్, 8వ తరగతి విద్యార్థి ఎం.లహరేశ్వర్‌లు ప్రథమస్థానంలో నిలిచారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎస్ఎంసీ సభ్యులు గ్రామస్థులు అభినందించారు.

కోనంకిలో దంతవైద్యశిబిరం

మార్టూరు, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనంకి గ్రామంలో కోటపాటి సురేష్ ఇంటి వద్ద ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. తేజశ్రీ వైద్యశాలకు చెందిన వైద్యులు డాక్టరు పవన్, డాక్టరు అమృతలు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

రాచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఆకవీడు పంచాయతీ పరిధిలోని ఆరవీటికోట గ్రామ పొలాల్లో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కె.రాజేష్ (30) తన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎడ్జ్ ఫీజు వేసు



రాజేష్ మృతదేహం

కుంటూ ఉండగా కటింగ్ బ్లేడ్ విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ పి.కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని రాజేష్ మృతికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకుని కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విద్యుత్ శాఖ ఏఈ కె.బాలగురవయ్య ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం


● 1,231 మందికి వైద్య పరీక్షలు

వాడరేవు(చీరాల), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు రామానంద స్వామి ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతం అయ్యింది. ఉదయం నుంచే



ఓపీ స్లిప్పులు అందిస్తున్న నిర్వాహకులు

ప్రారంభమైన సేవల్లో 1231 మంది పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో అవసరమైన వారికి నిర్వాహకులు ఉచితంగా నెలకు సరిపడా మందులు అందజేశారు. అల్పాహారం అందజేశారు. శిబిరం ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ పర్యవేక్షించగా, డా.రాజరాజేశ్వరీ, డా.కమలా రాజేశ్వరీ, డా.లలిత్ ప్రకాష్, డా.పేట శ్రీకాంత్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కష్ణారావు, ఫణి కిషోర్, కామేశ్వరరావు, శంకరరావు, బసవరావు, కుమార్, లింగరాజు, మోహన్, గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.



సత్యసాయిబాబా సేవలు విశ్వవ్యాప్తం

● జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ● ఘనంగా శతజయంతి



కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సత్య సాయిబాబాకు నివాళులు అర్పిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, అధికారులు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయిబాబా సేవలు విశ్వవ్యాప్తమని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. జేసీతోపాటు జిల్లా అధికారులు తొలుత సత్యసాయిబాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం శత జయంతి వేడుకల పతాకాన్ని ఆవిష్కరించారు. తదుపరి జేసీ మాట్లాడుతూ సత్యసాయిబాబా తన సేవలతో పుట్టపర్తికి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చారని చెప్పారు. రాయలసీమ ప్రజల దాహార్తి తీర్చిన మానవతామూర్తిగా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. బాబా ప్రేమ, శాంతి, మానవత, సేవ వంటి విలువలను ఆచరణలో చూపిన మహాత్ముడని అన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో విజయ్‌కుమార్, సమాచార శాఖ డీడీ వేణుగోపాల్, కలెక్టరేట్ ఏవో తుమ్మా విజయకుమార్, సత్యసాయిసేవా సంస్థ సభ్యులు సురేష్‌సింగ్, శేషు, నాగలక్ష్మీ, జీవన్‌శేఖర్ పాల్గొన్నారు.



సత్యసాయిబాబా చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న ఎస్పీ అజిత

● పోలీసు కార్యాలయంలో..

నెల్లూరు(క్రైం) : సత్యసాయిబాబా చిత్రపటానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు శ్రీనివాసరావు, గట్టమనేని శ్రీనివాసరావు, చంద్రమోహన్, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, అధికారులు పాల్గొన్నారు.

● నేడు కలెక్టర్‌కు నోటీసు అందచేత
● తదుపరి మేయర్ ఎవరు..?

మేయర్‌పై అవిశ్వాసం

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డితో మంత్రి సమావేశం
● దించేయాలని 40 మంది కార్పొరేటర్ల సంతకాలు



రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డితో కలిసి కార్పొరేటర్ల సమావేశంలో మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), నవంబరు23(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర మేయర్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని మెజారిటీ కార్పొరేటర్లు నిర్ణయించారు. టీడీపీ కార్పొరేటర్లు 40 మంది ఆమెను పదవి నుంచి దించేయాలని కోరుతూ సంతకాలు చేశారు.ఆదివారం రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో మొదట రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలోనూ, అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలోనూ టీడీపీ నేతలు సమావేశమయ్యారు. ఇద్దరు డిప్యూటీ మేయర్లతోపాటు టీడీపీకి చెందిన సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ముఖ్యనేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ మేరకు సోమవారం 11 గంటలకు వారు కలెక్టర్ హిమాన్షు శుక్లాకు నోటీసు అందచేయనున్నారు.

● పలు ఆరోపణల నేపథ్యంలో...

మేయర్ స్రవంతి, ఆమె భర్త జయవర్ధన్‌పై పలు ఆరోపణలు వెలుగు చూశాయి. ఈ నేపధ్యంలో ఆమెను పదవి నుంచి దించేయాలని తొలుత భావించారు. అయితే నాలుగేళ్లపాటు అవిశ్వాసం పెట్టేందుకు వీలు లేకపోవడంతో అధికార పార్టీ నేతలు ఇప్పటి వరకు ఎదురు చూశారు. గత వైసీపీ హయాంలో జయవర్ధన్ మార్టిగేజ్ నిధుల విడుదల్లో అప్పటి కమిషనర్ ఐఏఎస్ అధికారి సంతకాన్నే ఫోర్జరీ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో ఆయన జైలు జీవితం కూడా అనుభవించారు. రూ.కోట్లు కుంభకోణం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు కూడా తేల్చారు. ఆపై మరో ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా వచ్చారు. ఆయన సీసీని గదిలోపెట్టి తలుపేసి బంధించారు. ఈ క్రమంలో జయవర్ధన్ రెండోసారి జైలుకు వెళ్లారు. కాగా మేయర్ పేషీ ఖర్చుల పేరిట రూ. లక్షలు డ్రా చేసి లెక్కలు చూపలేదన్న విమర్శలను మేయర్ దంపతులు ఎదుర్కొన్నారు. కార్పొరేషన్ సమావేశాల్లో భోజనం ఖర్చుల పేరిట రూ. లక్షల బిల్లులను వారు బీనామీల పేరుతో డ్రా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలని టీడీపీ నిర్ణయించింది.

తదుపరి మేయర్ ఎవరు ?

మేయర్ స్రవంతిపై అవిశ్వాసం నెగ్గితే, తదుపరి మేయర్ ఎవరన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతుంది. మేయర్ స్థానం ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. 54 మంది కార్పొరేటర్లలో ఎస్టీలకు మూడే సీట్లున్నాయి. 12వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న స్రవంతి ప్రస్తుతం మేయర్‌గా కొనసాగుతున్నారు. కాగా 53వ డివిజన్ కార్పొరేటర్ సుజాత, 5వ డివిజన్ కార్పొరేటర్ రవిచంద్ర ఎస్టీలే. వీరిద్దరిలో ఎవరిని ఎంపిక చేస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. సుజాతకు ఎక్కువ అవకాశాలున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇద్దరు డిప్యూటీ మేయర్లలో ఒకరికి ఇన్‌చార్జి మేయర్ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం ఉంది.

కార్పొరేటర్ స్థానాల పెంపు

నగరంలో 17 కార్పొరేటర్ స్థానాలను పెంచేందుకు మంత్రి పొంగూరు నారాయణ సంకేతాలిచ్చారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో ఆయన సూచనప్రాయంగా ఈ విషయం తెలిపారు. ప్రస్తుతం కార్పొరేషన్ పరిధిలో 54 స్థానాలుండగా, వాటిని 71కి పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. కోఆప్షన్ సభ్యులు ఐదుగురు ఉండగా, ఆ స్థానాలు 8కి పెరిగే అవకాశాలున్నాయి. మరో ఏడాది లేదా అంతకన్నా ముందే (రాష్ట్ర వ్యాప్తంగా) ఎన్నికలు వచ్చే అవకాశాలుండటంతో మంత్రి ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా మరికొంతమంది నగర నేతలకు పదవులు లభించనున్నాయి.

● వైసీపీలోనూ భంగపాటు

తనను మేయర్ పదవి నుంచి అవిశ్వాసం ద్వారా దించేయాలని టీడీపీ చూస్తున్నదని, తనకు మద్దతుగా నిలవాలని మేయర్ స్రవంతి దంపతులు వైసీపీ నేతలను కోరారు. కానీ అక్కడ కూడా వారికి భంగపాటే ఎదురైనట్లు తెలిసింది.



ఉదయగిరి మండలం గండిపాళెంలో జోరుగా కురుస్తున్న వర్షం

మళ్లీ వానలు

● అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షం
● మెట్ట ప్రాంతంలో జోరు
● నేడు కూడా కొనసాగే అవకాశం
● ప్రజలను అప్రమత్తంగా ఉంచాలి : ఎస్పీ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలోని దక్షిణ అండమాన్ వద్ద ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఆదివారం వర్షం కురిసింది. ఉదయం వర్షం పడినా, మధ్యాహ్నం ఎండకాసింది. జిల్లాలో 6.4 మి.మీల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రాపూరులో 53.6 మి.మీ, అత్యల్పంగా కోవూరులో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది.అల్పపీడన ప్రభావంతో సోమవారం కూడా జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

● మెట్టలో జోరు వర్షం

ఉదయగిరి రూరల్ : మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి చిరుజల్లులు పలకరించినా, ఉదయం నుంచి ఏకతాటిగా 3 గంటల పాటు వర్షం కురిసింది. అంతేకాక చలిగాలుల ప్రభావం అధికమవడంతో పిల్లలు, వృద్ధులు బెంబేలెత్తిపోయారు. రైతులతోపాటు మూగజీవాల యజమానులకు వర్షంతో ఊరట కలిగింది.

● ప్రజలను అప్రమత్తంగా ఉంచాలి

నెల్లూరు(క్రైం) : పెన్నా పరివాహక ప్రాంత, తీర మండలాల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని పోలీసు అధికారులను ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదివారం ఓ ప్రకటనలో ఆదేశించారు. రానున్న 4,5 రోజుల్లో జిల్లాలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో సోమశిల నుంచి నీరు కిందకు విడుదల చేయనున్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి ఆదివారం 27,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని తెలిపారు. ఇన్‌ఫ్లోను బట్టి నీటి విడుదల పెరుగుతూ ఉంటుందని, దిగువన ఉన్న ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

డ్యాముల్లో నిండుగా..

● సోమశిలకు 18,500 ఇన్‌ఫ్లో

అనంతసాగరం : సోమశిల ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 18,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టుల్లో 75.107 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 500, డెల్టాకు 27,300, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● కండలేరులో 57.08 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 57.08 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 550 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 980 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

● 18వేల క్యూసెక్కుల ప్రవాహం

సంగం : సంగం బ్యారేజీకి సోమశిల నుంచి ఆదివారం సుమారు 18 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి చేరుతుంది. దీంతో బ్యారేజ్ వద్ద నీటి మట్టం 11 అడుగులకు స్థిరీకరించారు. 5 గేట్లు ఎత్తి దిగువ నెల్లూరు బ్యారేజీకి నీటిని విడుదల చేసున్నట్లు సెక్షన్ ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

పాదర్శకతకు పంగనామం

● ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు కాని ఈ-ఆఫీస్
● టెక్నాలజీని అందిపుచ్చుకోని అధికారులు
● కొన్ని శాఖల్లో అరకొర.. మరికొన్నింటిలో నిల్
● మ్యాన్యువల్ విధానంలో ఇంజనీరింగ్ శాఖల్లో ఆడిందే ఆట !

ఫైళ్లు మాయం.. ఆలస్యం.. సిబ్బంది నిర్లక్ష్యం



నెల్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ పెరిగే కొద్దీ పనితీరులో వేగం, పారదర్శకత పెరగాల్సింది పోయి, ప్రభుత్వ శాఖలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పారదర్శక పాలన కోసం ప్రతీ ప్రభుత్వ శాఖ ఈ-ఆఫీస్ విధానాన్ని పాటించాలని ప్రభుత్వం పదే పదే ఆదేశిస్తున్నది. అయితే ఇంకా పలు శాఖలు ఆ వైపు చూడడం లేదు. కొన్ని శాఖలు ఈ-ఆఫీస్‌ను ఉపయోగిస్తున్నామంటే ఉపయోగిస్తున్నాం.. అన్న తీరున వ్యవహరిస్తున్నాయి. కొన్నిశాఖలు ఇంకా కూడా మ్యాన్యువల్‌గానే పాలన సాగిస్తున్నారు. దీని ఫలితంగా ప్రభుత్వం ఆశించినంత వేగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్ జరగడం లేదు. పైపెచ్చు మాన్యువల్ విధానంలో కొన్ని ఫైళ్లు మాయమవుతున్నాయి.అదే సమయంలో జవాబుదారీతనం లేకుండా పోతున్నది. ఏ ఫైల్ ఎక్కడుందో తెలుసుకోవడం కూడా కష్టంగా మారింది. ఇక అక్రమాలకు కూడా అడ్డుకట్ట పడడం లేదు. ఈ-ఆఫీస్ విధానంలో అయితే ఒకసారి సంతకం చేసిన ఫైల్‌ను మార్చేందుకు వీలు కుదరదు. కానీ మాన్యువల్ ఫైల్స్ కావడంతో తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అధికారులు, సిబ్బందికి అవకాశం ఉంది.

● కలెక్టర్ ఆదేశించినా..

మాన్యువల్ ఫైల్ విధానంలో మరో ప్రధానమైన సమస్య సమయం వృథా కావడం. ఒక సీటు నుంచి లేదా ఒక కార్యాలయం నుంచి మరో చోటకు ఫైల్ తీసుకెళ్లే విషయంలో జాప్యం జరుగుతోంది. ఒక ఉద్యోగికి ఇదే పనిగా మారుతోంది. అదే సమయంలో కాన్ఫిడెన్షియల్ ఫైల్స్ సమాచారం బయటకు వస్తోంది. కలెక్టర్ లేదా జేసీ పంపే ఫైల్స్‌ను సదరు శాఖ అధికారులు నేరుగా తీసుకొచ్చి కలెక్టర్ సమయం ఇచ్చే వరకూ కలెక్టరేట్‌లో ఎదురుచూస్తుంటారు. ఈలోపు ఆయా అధికారుల కోసం వారి కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు, సామాన్యులకు ఎదురుచూపులు తప్పవు. ఈ పరిస్థితులను అధిగమించడానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రతీ శాఖ ఈ-ఆఫీస్‌ను అనుసరించాలని ఆదేశాలిచ్చారు. తనకు పంపే ఫైల్స్‌ను తాను చెబితే తప్ప మిగతా సమయంలో ఈ-ఆఫీస్‌లోనే పెట్టాలని ఆదేశించారు. కానీ ఇప్పటికీ కీలకమైన శాఖలు కూడా ఈ-ఆఫీస్‌లో ఫైళ్లు నడపకపోవడం గమనార్హం.

● ప్రజలకు కష్టం.. ప్రభుత్వానికి నష్టం

ప్రస్తుత కాలంలో ప్రైవేటు సేవలు వేగంగా అందుతున్నాయి. డోర్ డెలివరీ చేసే దశకు సమాజం అభివృద్ధి చెందితే.. ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం ప్రజలు నేరుగా వెళ్లి కాళ్లరిగేలా తిరుగుతున్నా పనులు ఒక పట్టాన జరగడం లేదు. వేగంగా సేవలందించే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ శాఖలో కచ్చితంగా ఈ-ఆఫీస్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే ఆ తర్వాత పట్టించుకోలేదు. ఆయా శాఖల అధికారులు కూడా దాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఈ ప్రభావం ప్రజా సమస్యల పరిష్కారంపై పడుతుండడంతో అది ప్రభుత్వానికి నష్టాన్ని కలిగిస్తోంది. ఒక భూ సమస్యపై తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరే వరకూ ఎన్ని తంటాలు పడాలో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏ దశలో ఎవరి దగ్గర ఫైల్ ఉందో..? ఎందుకు ముందుకు కదలడం లేదో..? అన్న విషయాన్ని తెలుసుకునేందుకు కూడా అర్జీదారుడు అనేకసార్లు కార్యాలయాల చుట్టూ తిరగాలి. ఇక తీరా అర్జీవో కార్యాలయానికో లేక కలెక్టరేట్‌కో ఫైల్ వస్తే అక్కడ గుంపులో కలిసిపోతోంది. ఉన్నతాధికారులు ఈ ఫైల్ గురించి ప్రత్యేకంగా అడిగినప్పుడు వెతుకులాట ప్రారంభిస్తున్నారు. ఇక ఆ సీటు చూసే ఉద్యోగి బదిలీ అయ్యారంటే ఆ ఫైల్‌ను వెతికి పట్టుకోవడం ఒక సాహసంగానే చెప్పవచ్చు.

● ఇంజనీరింగ్‌శాఖలో విచ్చలవిడితనం

ఇంజనీరింగ్ శాఖల్లో అయితే ఈ-ఆఫీస్ లేకపోవడంతో విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఆర్‌అండ్‌బీ శాఖలో ఓ టెండర్‌కు సంబంధించి నిబంధనను మార్చాలని ఓ ఉన్నతాధికారి సిబ్బందిని ఆదేశించారు. అయితే అది నిబంధనలకు విరుద్ధమని సిబ్బంది చెప్పినా, వారిపై ఒత్తిడి తెచ్చి మరీ మార్పించారు. ఇదంతా మాన్యువల్ ఫైల్ కావడంతోనే జరిగింది. అదే ఈ-ఆఫీస్ అయితే ఎందుకు నిబంధన మార్చాల్సి వచ్చిందో సదరు ఉన్నతాధికారి అక్కడ రిమార్కులు రాయాల్సి ఉంది కాబట్టి తప్పు చేసేందుకు సాహసించరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.1.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని రంగనాయకులపేటలో వెంకటమ్మ పేరంటాలు ఆలయ రాజగోపురం మహామండపం, ఇతర అభివృద్ధి పనులకు ఆదివారం సాయంత్రం భూమిపూజ జరిగింది. రూ.1.15 కోట్లతో మూడంతస్తుల రాజగోపురం, మహా మండపం నిర్మాణానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేవదాయ శాఖ జిల్లా ఏసీ జనార్దన్‌రెడ్డి, ఆలయ ఈవో మోహన్ కుమార్ పాల్గొన్నారు.

రైతన్నా... మీకోసం...!

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాల్నది. ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా అడుగులు వేస్తున్నది. ఈనేపథ్యంలో సోమవారం (నేటి) నుంచి రైతుల ఇంటింటికి వెళ్లి 'రైతన్నా.. మీకోసం' అంటూ ఐదు విధానాలతో కార్యాచరణ అమలుపై అన్నదాతలకు అవగాహన కల్పించనున్నది.

● నేటి నుంచి వారం రోజులు ప్రత్యేక కార్యక్రమం
● లాభసాటి వ్యవసాయమే ప్రభుత్వ లక్ష్యం
● ఒక్కో ఆర్ఎస్‌కే పరిధిలో ఒక్కొక్క టీం



నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, దాని అనుబంధరంగాలు, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య రంగాలు రాష్ట్ర జీడీపీలో 35శాతం వాటా అందిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయి. 2047 నాటికి మరో 15శాతం వృద్ధి రేటు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నది. అలాగే మరో ఐదేళ్లలో రైతుకు మరింత ఆదాయం తెచ్చిపెట్టేలా అడుగులు వేయించాలని ఐదు విధానాలతో కార్యాచరణ అమలు చేస్తున్నది. వీటిపై రైతులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. ఇందులో నీటి భద్రత ఎంతో ముఖ్యం. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడంలో భాగంగా అసంపూర్తి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి, నీరు నింపడం. మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా అన్నదాతల సాగు పద్ధతుల్లో మార్పు. పంట మార్పిడి పాటించడం, చిరుధాన్యాల సాగు పెంచడం, ప్రకృతి వ్యవసాయం పెద్ద ఎత్తున చేపట్టడం. ప్రతి రైతుకు యూనిక్ ఐడీ ఇవ్వడడంతోపాటు ప్రభుత్వ పథకాలు అందించడం. డ్రిప్, స్ప్రింక్లర్ల సేద్యం విస్తరణ, ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు శాతం సబ్సిడీపై బిందు సేద్యం పరికరాలు అందించడం, ఇంకా కిసాన్ డ్రోన్‌సేవలు అందించడం, యంత్రాలు, టెక్నాలజీ వాడకతో వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించడం, పంటల ఆరోగ్యస్థితి అంచనా వేయడానికి శాటిలైట్ టెక్నాలజీ వాడకం. రైతుల పంటలకు విలువ పెంచుకునేందుకు ఇప్పటికే రూ.13వేల కోట్లతో 38 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో ఎంవోయూ కుదుర్చుకోవడం, ఇంకా రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ, పీఎం.కిసాన్ పథకం కింద మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.20వేలు అందించడం, పీఎం ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలు అమలు, మద్దతు ధర కల్పించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం.

● ఒక్కో ఆర్ఎస్‌కే పరిధిలో ఒక్కొక్క బృందం

రైతన్నా.. మీకోసం కార్యక్రమ అమలుకు ఒక్కో రైతు సేవా కేంద్రం(ఆర్ఎస్‌కే) పరిధిలో ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో సచివాలయం సిబ్బంది ఉండగా, వారికి గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ పశుసంవర్ధకశాఖ సహాయకులు, గ్రామ మత్స్య సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకుల బృందం నాయకత్వం వహిస్తారు. మండల వ్యవసాయాధికారులు, మండల పశువైద్యులు, మత్స్య అభివృద్ధి అధికారులు, ఉద్యానశాఖ అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఆయా ఆర్ఎస్‌కే పరిధిలో ఎంతమంది అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు సంబంధించిన నగదు అందుతుందో...? వారి కుటుంబాలను పలకరించడం, ప్రభుత్వ పథకాలపై కొన్ని ప్రశ్నలు వేయడం, వారు చెప్పే సమాధానాలను యాప్‌లో అప్‌లోడ్ చేసి, ఫొటో దిగడం చేస్తారు. ఇకపోతే సీఎం చంద్రబాబు సందేశంతో కూడిన కరపత్రం ఇస్తారు. ఆయా గ్రామాల పరిధిలో పరిస్థితులు, రైతుల అవసరాలపై ఆరా తీస్తారు. ఇలా వారం రోజులు కార్యక్రమం నిర్వహిస్తారు. డిసెంబరు 3న రైతులతో వర్క్‌షాపు నిర్వహిస్తారు.

హమ్మో.. వానరాలు!

కావలిలో కోతుల బెడద



కావలి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): కావలి టౌన్‌లో కోతుల బెడద రోజురోజుకూ ఎక్కువవుతోంది. తలుపులు తీస్తే ఇళ్లలోకి చొరబడేందుకు గోడలపై వానరాలు సిద్ధంగా ఉంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. చేతిలో కర్ర లేకపోతే దాడి చేసి మరీ.. ఇళ్లలోకి వెళ్లి సామాన్లు తీసుకెళుతుండటంతో మహిళలు బెంబేలెత్తిపోతున్నారు. కోతుల సమస్యపై ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గతంలో కోతులను పట్టుకున్నవారికి బిల్లులు ఇంకా ఇవ్వకపోవటంతో.. ఇప్పుడు ఎవరూ వాటిని పట్టుకునేందుకు ముందుకు రావడం లేదని సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 660

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11,881
వెండి కిలో ధర రూ. 1,58,400
వెండి ఒక గ్రాము రూ.163.40

జేబీ విద్యార్థుల సామాజిక సర్వే

కావలి (టౌన్) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో ఆదివారం జేబీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే సామాజిక, ఆర్థికపరమైన సర్వే నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా నిర్వహించి సర్వేలో విద్యార్థులు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ సర్వే వల్ల ఆయా ప్రాంతాల్లోని ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు అయూబ్ అహ్మద్, నాగేశ్వరరావు, వీడీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

అల్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించాలని సామాజికవేత్త ఎం. మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో దాదాపు 1000 కి.మీ సముద్ర తీరం ఉందని, ఈ తీరం వెంబడి 55 లక్షల మంది మత్స్యకారులు జీవిస్తున్నారన్నారు. మత్స్య సంపదను సేకరించి విదేశీ మారకద్రవ్యాన్ని రాష్ట్రానికి తెచ్చేందుకు ప్రధాన భూమికను పోషిస్తున్న మత్స్యకారులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి దివి పరామర్శ

కందుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన పట్టణంలోని సింహాద్రినగర్‌కు చెందిన టీడీపీ క్రియాశీల కార్యకర్త పరిటాల మాధవరావు కుటుంబసభ్యులను టీడీపీ నేత దివి రవీంద్రనాథ్ ఆదివారం పరామర్శించారు. మాధవరావు బావమరిది, కాంట్రాక్టరు చిడిపోతు వెంకట సురేష్‌బాబు, ఇతర కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు.

సర్కస్ ఫీట్లు కాదు.. వాహనదారుల పాట్లు!



కలిగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలిగిరి-దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కలిగిరి పట్టణంలో నిర్మించిన జాతీయ రహదారి పనులు అస్తవ్యస్తంగా మారాయి. రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక హెచ్‌పీ పెట్రోల్‌బంకు సమీపంలో రోడ్డు సరిగా లేకపోవడంతో కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టరు ప్రమాదవశాత్తు ఇంజన్ భాగం పైకి లేచింది. స్థానికులు అప్రమత్తమవడంతో ప్రమాదం తప్పింది. రహదారి పనులు సరిగా చేయకపోవడంతో ఈ మలుపు వద్ద సర్కస్ ఫీట్లు చేయాల్సివస్తోందని వాహనదారులు వాపోతున్నారు. గుంతలమయమైన రహదారి నిర్మాణాలను సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సంక్షేమ పథకాల అమలు చంద్రబాబుకే సాధ్యం

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఉలవపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలను అమలుచేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే సాధ్యమని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బద్దిపూడి గ్రామంలో ఆదివారం మాజీ సర్పంచ్ కూనం అనీల్‌రెడ్డి, కూనం వెంకట సుబ్బారెడ్డిల వర్ధంతి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఎంపీ వేమిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేవీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కూనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసి ప్రారంభించారు. తొలుత కూనం అనీల్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డిల సమాధుల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆసుపత్రులను ప్రయివేటు పరం చేస్తోందంటూ గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టడం వైసీపీకి తగదన్నారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన ఆసుపత్రులను అభివృద్ధి చేసి తిరిగి ప్రభుత్వపరం చేయడమే పీపీపీ ఉద్దేశమన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటార న్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు

రోడ్డు, వంతెనకు నిధులివ్వండి

బద్దిపూడి చెరువు మీదగా కొత్తపేట చెరువుల వరకు తారురోడ్డు నిర్మాణం, బద్దిపూడి గ్రామానికి ఆనుకొని ప్రవహిస్తున్న ఉప్పుటేరుపై తూమలతో వంతెన ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ఎంపీ నిధులు మంజూరు చేయవలసిందిగా ఎంపీని కోరగా ఆయన సుముఖత వ్యక్తం చేశారు. కాగా, వైద్యశిబిరంలో సుమారు 700 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూనం ఈశ్వరమ్మ, కూనం బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు వెంటకటరమణ ప్రయివేటు ఆసుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కందుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్కంధపురి జనార్ధనస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మాలధారులు ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం ఆయన జనార్ధనస్వామిని, వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి దుడ్డు ప్రసాద్, మాలధారులు హనుమంతరావు, మురారిశెట్టి సుధీర్, చక్కా కేశవ తదితరులు పాల్గొన్నారు.

మేథోశక్తిని పెంపొందించుకుంటేనే లక్ష్య సాధన : డీఎస్పీ శ్రీధర్

కావలి (టౌన్) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మేథోశక్తిని పెంపొందించుకుంటేనే లక్ష్యసాధన సాధ్యమవుతుందని డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎమ్ఎమ్ఎస్) నమూనా పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఫౌండేషన్ చైర్మన్, విశ్రాంత అధ్యాపకులు ప్రసాదరావు అధ్యతన జనతాపేటలోని విశ్వశాంతి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై బహుమతులు అందజేసి, విద్యార్థులను అభినందించారు. కేంద్రప్రభుత్వం డిసెంబరు 7న నిర్వహించనున్న ఎన్ఎమ్ఎమ్ఎస్ పరీక్షలకు సమాయత్తం అయ్యేందుకు ఇటువంటి నమూనా పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. మొదటి బహుమతి జ్యోత్స్న, రెండవ బహుమతి నాగచైతన్య, మూడవ బహుమతి ఆదిత్యశేఖర్, నాల్గవ బహుమతి సమీర్, మరో ఆరుగురు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో విశ్వశాంతి పాఠశాల కరస్పాండెంట్ ఎన్వీ రమణయ్య, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఖాదర్‌బాష, ఆర్ దిలీప్‌కుమార్, సయ్యద్ ఘనీ బాష, మాలకొండారెడ్డి, అజిత్ బాబు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న డీఎస్పీ శ్రీధర్

కావలిని కనక పట్టణంగా మారుస్తా!

● వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణాన్ని కనక పట్టణంగా మార్చి చూపిస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని లతా థియేటర్ ఎదురుగా వడ్డిపాలెం వద్ద బ్రహ్మంగారి ఆలయ పునరుద్దరణలో భాగంగా ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మం గారి ఆశీస్సులు కావలి నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాం క్షించారు. కావలి పట్టణం కనక పట్టణం అవుతుందని ముందుగానే మహిమాన్వితంగా ప్రకటించిన ఏకైక తాత్వికుడు బ్రహ్మంగారేనని, ఆ దేవదేవుని ఆశీస్సులతో కావలిని నిజమైన కనక పట్టణం చేసి చూపిస్తానని ఆయన అన్నారు. పవిత్రతకు మారుపేరైన ఈ ప్రాంతం బ్రహ్మంగారు, గంగమ్మ, అంకమ్మ, కలుగోళ్లశాంభవి ఆలయాలతో సాంస్కృతి, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కలిగి ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి రూ. 50 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. పెద్దపవని రోడ్డు నుంచి కలుగోళ్ల శాంభవి ఆలయం వరకు ఈ ప్రాంతంలో విశాలమైన రహదారులను నిర్మిస్తామన్నారు.

● **అయ్యప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

స్థానిక ముసునూరులోని ఆలయంలో అయ్యప్పస్వామిని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చాకిచర్ల విద్యార్థి ఎంపిక



ఉలవపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి సూరగాని గోకుల్‌చందు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్ రావు తెలిపారు. ఇటీవల తెనాలిలో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలలో ప్రకాశం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రతిభ కనరచడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఓగుబోయిన శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని తుమ్మూరులో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17 హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటాడన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, తోటి విద్యార్థులు గోకుల్‌చందును అభినందించారు.

పులి శీనయ్యకు పితృవియోగం

దగదర్తి (వీబిట్రగుంట) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం చవటపుత్తేడు గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, తలమంచి మేజర్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ పులి శీనయ్య తండ్రి పులి యర్రయ్య (70) శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదివారం యర్రయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు జలదంకి శ్రీహరినాయుడు, అల్లం హనుమంతరావు, పాపన బోయిన మల్లికార్జునరెడ్డి, తాళ్ళూరు సుధాకర్ నాయుడు, వడ్డే వినయ్‌కుమార్ స్థానిక టీడీపీ నేతలు కార్యకర్తలు ఉన్నారు.

శివయ్య, గంగమ్మకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల కేంద్రంలోని గంగతిప్పపై వెలసిన శివయ్యగంగమ్మలకు బోగోలు షిర్డీసాయి సేవకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి పురాతన శివలింగానికి సాయిసేవక బృందం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సాయిసేవకులు లింగంశెట్టి విజయ, మానికల ఐశ్వర్య, తుమ్మలపల్లి గీత, బచ్చుపద్మ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కావలి (టౌన్) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ నెల 25న కావలి పట్టణంలోని ఎమ్మెస్సార్ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాను నిరు ద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డీ. కృష్ణారెడ్డి కోరారు. 14 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యే ఈ జాబ్‌మేళాలో 830మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, బీ ఫార్మసీ, పీజీ అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసున్నవారు అర్హులన్నారు. రూ. 12,000 నుంచి రూ. 25,000 వరకు వేతనా లు ఉంటాయన్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి వేడుకలు

ఆత్మకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాహసీల్దారు కార్యాలయంలో ఆదివారం సత్యసాయి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికారులు, కార్యాలయ సిబ్బంది సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కొండయ్య, సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు ప్రతాప్, పి రవిబాబు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయగిరి: సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

● **సంగం:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **ఉదయగిరి:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు హజరత్‌మస్తాన్, శ్రీనివాసులు, కంప్యూటర్ ఆపరేటర్ నరసింహారావు, వీఆర్ఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

ఉదయగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ వెంకట్రావుపల్లిలో నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయం 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈసందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు సన్మానించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి

అంకాళమ్మకు పొంగళ్లు

సీతారామపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెస్తకాలనీ సమీపంలో కొలువైన గ్రామదేవత అంకాలమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అంకాలమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామికి అభిషేకాలు

సంగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగం, పెన్నానది ఒడ్డున సంగమేశ్వరాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి మహాపడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ భక్తులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అయ్యప్పకు అభిషేకాలు చేస్తున్నఅర్చకులు

ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ ధ్యేయం : మంత్రి ఆనం

ఆత్మకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ ధ్యేయంగా ఆలయాలను తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆత్మకూరు పట్టణ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయ ట్రస్టీగా నియమితులైన కాటంరెడ్డి రవీంద్రారెడ్డి ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆలయాల పరిరక్షణ తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆత్మకూరులోని అభయాంజ నేయస్వామి ఆలయ వంశ పారంపర్య అధ్య క్షుడు కాటంరెడ్డి రవీంద్రారెడ్డికి ఆలయ అభివృద్ధి బాధ్యతలను అప్పగిస్తున్నామన్నారు. త్వరలోనే ఆలయ పాలకమండలి సభ్యులను నియమిం చాలని జిల్లా దేవ దాయ శాఖ అధికారిని ఆదేశించామన్నారు. ప్రతి గుడిలో దూపదీప నైవేద్యం కోసం రూ. 10వేలు మంజూరు చేస్తున్నామన్నారు. అభయాంజనేయస్వా మి ఆలయం వద్ద నుంచి మినీ బైపాస్ రోడ్డును 100 అడుగులతో నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేసేలా పనులు చేపట్టామన్నారు. ఆత్మకూరు సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు. ముందుగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వేదపండితులు, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జి వెంకటరమణమ్మ, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ కేశవచౌదరి, రాజుపాలెం సొసైటీ చైర్మన్ కాటంరెడ్డి నారసింహారెడ్డి, పలువురు కూటమి నేతలు, పురప్రముఖులు పాల్గొన్నారు.



కాటంరెడ్డి రవీంద్రారెడ్డి ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి ఆనం

ఇళ్లస్థలాల సమస్య పరిష్కరించాలి

సంగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజనసంఘం వద్ద ఓ ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆదివారం సిద్ధిపురం గ్రామానికి చెందిన మహిళలు ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. దీంతో ఆయన అక్కడే ఉన్న తహసీల్దారు సోమ్లానాయక్‌ను పిలిచి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంకు అన్నారెడ్డిపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'రైతన్నా.. మీకోసం'

ఉదయగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం, మర్రిపాడు, దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో సోమవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుసేవా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రతి రైతు కుటుంబాన్ని కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి సందేశం వినిపించడం, నీటి లభ్యత, డిమాండ్ ఆధారిత పంటలు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

స్వదేశీ వస్తువుల వినియోగంపై ఇంటింటా ప్రచారం

ఉదయగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులను వినియోగిస్తే గ్రామాలు ఆర్థికాభివృద్ధి చెందుతాయని మం డల బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆత్మనిర్భర భారత్ కార్యశాల కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు మండలంలోని కుర్రపల్లి, శకునాలపల్లి, బోడబండ, పుల్లాయపల్లి, లింగంనేనిపల్లి, కృష్ణారెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామాల్లో స్వదేశీ వస్తువులు వినియో గించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ నాయకులు గడ్డం ప్రసాద్, మాధవరెడ్డి, మన్నేటి శ్రీనివాసులరెడ్డి, నారా యణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మానవ సంబంధాలు పెంపొందించడమే లక్ష్యం

ఉదయగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మానవ సంబంధాలు పెంపొందించడమే లక్ష్యంగా జమాతే ఇస్లామీ హింద్ పనిచేస్తోందని ఆశాఖ జిల్లా అధ్యక్షురాలు ఫాతిమా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దిలార్‌భాయ్ వీధి మదరసాలో ఉదయగిరి జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం అధ్యక్షురాలు అసియా ఆధ్వర్యంలో పొరుగువారి హక్కుల దేశవ్యాప్త ఉద్యమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈఉద్యమ నిర్వహణకు మహిళా కన్వీనర్‌గా ఫర్వీన్, కోకన్వీనర్‌గా అల్సానియాలు వ్యవహరించి వివిధ ప్రాంతాలు, కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జమాతేఇస్లామీ హింద్ సభ్యులు

గిరిజన కాలనీలో తాగునీటి బోరు ఏర్పాటు

ఆత్మకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని 21వ వార్డు మోడల్ ఎస్టీ కాలనీలో నిత్యాన్నదాత, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి సొంత నిధులతో తాగునీటి బోరును ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన అనంతసాగరం మండలం చిలకలమర్రి గ్రామానికి వెళ్లి ఇటీవల అగ్నిప్రమాదంలో నష్టపోయిన గంటపోయిన పెంచలయ్యయాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. దగ్ధమైన ఇంటిని పునర్నిర్మించుకునేందుకు రూ. 20వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమాల్లో అనంతసాగరం మండల టీడీపీ మాజీ అధ్యక్షురాలు మునగపాటి సునీతమ్మ, ఆత్మకూరు పట్టణ బీజేపీ మాజీ అధ్యక్షుడు కట్టా మహేష్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



అభిషేకాలకు పెన్నానది జలాలను తీసుకు వస్తున్న భక్తులు

సంగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనసూయనగర్‌లో సీతలాంబ, బొడ్డురాయి, గెవిటి రాళ్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బిందెలతో పెన్నానది జలాలు తెచ్చి విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'అన్నదాత సుఖీభవ'తో రైతులకు వెసులుబాటు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అనంతసాగరం నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడంతో మొదటి పంట సాగుచేస్తున్న రైతులకు వెసులుబాటు కలిగిందని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శాఖమూరి సుబ్బారావు తెలిపారు. ఆదివారం టీడీపీ నాయకులతో కలసి విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెట్టుబడి ఖర్చులకు నిధులు వేయడంతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ యువత అధ్యక్షుడు కమ్మ ప్రభాకర్‌నాయుడు, ఇస్కపల్లి మాజీ సర్పంచు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలి

వింజమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లు లేని నిరుపేదలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఆధ్వర్యంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సారధ్యంలో నూతన ఇళ్ల మంజూరుకు దరఖాస్తుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని టీడీపీ నాయకులు కోడూరు నాగిరెడ్డి తెలిపారు. స్థానికంగా సచివాలయంలో 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.